RNI NO: APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 161 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8 వెల రూ. 2 శుక్రవారం -11 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## మైనర్ల సోషల్ మీడియా వాడకం... పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు

- మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు తెరవకుండా నిషేధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్
- కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఒప్పందాలు చేసుకోలేరని పిటిషనర్ వాదన
- పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ
- భారత్‌లో కొన్ని పటిష్ఠమైన రక్షణ చర్యలు అవసరమని చీఫ్ జస్టిస్ వ్యాఖ్య

## గల్వాన్ తర్వాత తొలిసారి.. మోదీ-జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?



- సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు
- మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి అవకాశం
- 2020 గల్వాన్ తర్వాత ఇదే తొలి ముఖాముఖి చర్చ
- అజిత్ దోవల్ ఇటీవల చైనాలో చర్చలు
- సరిహద్దు, వాణిజ్యం, భద్రతపై చర్చకు అవకాశం



## కాకినాడ జిల్లాలో పులి సంచారం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- కాకినాడ జిల్లాలో పులి సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశం
- అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- ప్రజల భద్రతతో పాటు పులికి హాని జరగకుండా చూడాలని స్పష్టీకరణ

## స్వచ్ఛతాన్' పోస్టర్‌ను రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్



- స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్ లాంచ్
- రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేస్తారు
- ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి
- దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మంది స్వచ్ఛతా రన్‌లో పాల్గొనే అవకాశం

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

# టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి

### 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- ★ కొత్త తరం నాయకత్వ పద్ధతులు అలవర్చుకోవాలని కలెక్టర్లకు సూచన
- ★ పరిపాలనలో ఏఐ, టెక్నాలజీ వినియోగంతో కచ్చితమైన ఫలితాలు సాధించాలని నిర్దేశం
- ★ అధికారులు, నేతలకు విశ్వసనీయతే అత్యంత ప్రధానం అన్న సీఎం
- ★ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలోచనా విధానం మార్చుకోవాలని పిలుపు



అమరావతి: ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. మిగతా 2 లో



## తిరుమల భక్తులకు టీటీడీ భరోసా.. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు!

- తిరుమల శ్రీవారి భక్తుల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచిన టీటీడీ
- దేశంలోనే తొలిసారిగా సహజ మరణానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- సెప్టెంబర్ 15 నుంచి సాలకట్ల, అక్టోబర్ 12 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

## సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?

### విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్న కేటీఆర్

- పాతకాలపు కరెంట్ కోతలు పునరావృతమవుత ున్నాయని విమర్శ
- రేవంత్ సొంత గ్రామంలోనే రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారన్న కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిగతా 2 లో

## 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు

# రిజిస్ట్రేషన్ అవకాశం

### దీర్ఘకాలిక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

- అక్రమాలు జరిగిన 4 లక్షల ఎకరాలపై విచారణ తర్వాత నిర్ణయం
- 28 లక్షల ఎకరాలు 22-ఏ జాబితా నుండి తొలగింపు
- కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి : రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మిగతా 2 లో

## బీఆర్ఎస్ కుట్రలను

# బలంగా తిప్పికొట్టాలి

### "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలి

- సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర
- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.



## దుష్ప్రచారాలు నమ్మొద్దు: గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్

- గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్
- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి
- అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ



- ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు
- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ
- పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు
- ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా: జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్సీఈఆర్టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: "గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. "గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు

తమిళనాడు: ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## వందేమాతరంపై కాంగ్రెస్ వర్సెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్.. కారణమిదే

ఢిల్లీ: జమ్మూకాశ్మీర్‌లో అధికారంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ కూటమిలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. 'వందేమాతరం' గీతాలాపన విషయంలో తలెత్తిన ఈ వివాదం, కూటమిలోని ఆధిపత్య పోరుకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల శ్రీనగర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆయన తండ్రి ఫరూక్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వ నూతన నిబంధనల మేరకు ఆరు చరణాల పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో గౌరవసూచకంగా నిలబడ్డారు. అయితే, దీనిపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. 1937 నాటి పార్టీ తీర్మానం ప్రకారం వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని, మిత్రపక్షాలు కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు. కాంగ్రెస్ సూచనను నేషనల్ కాన్ఫరెన్స్ తోసిపుచ్చింది. పార్లమెంటు చట్టం ప్రకారం జాతీయ గీతాలను గౌరవించడం తమ రాజ్యాంగబద్ధమైన విధి అని, దీనికి పార్టీల సిద్ధాంతాలతో సంబంధం లేదని ఎన్సీ అధికార ప్రతినిధి తన్వీర్ సాదిక్ స్పష్టం చేశారు. అయితే, ఈ రెండు పార్టీల మధ్య వివాదం కేవలం వందేమాతర గీతానికి పరిమితం కాలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎన్సీ 42 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ కేవలం 6 స్థానాలకే పరిమితమైంది. దీంతో కూటమిలో తమదే పైచేయి అని నిరూపించుకునేందుకు ఎన్సీ ప్రయత్నిస్తోంది. గతంలో కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారం, రాష్ట్ర హోదాపై ఆందోళనలు, రాజ్యసభ సీట్ల కేటాయింపు వంటి అంశాల్లోనూ ఉభయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 1987లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం వల్ల తమ ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతిన్నదనే భావన ఎన్సీ శ్రేణుల్లో బలంగా ఉంది. ఈ చారిత్రక కారణాల వల్లే కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ఎన్సీ నాయకత్వం గట్టిగా వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తోంది.

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి.. టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి: సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్‌షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో "లీడర్‌షిప్ - న్యూ ఏజ్ గవర్నెన్స్" అనే అంశంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం. సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణ. ఈ విషయంలో మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం చూడటం పాత కాలపు పద్ధతి'' అని అన్నారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు దశలో ఉన్నామని, అందరూ కొత్త నాయకత్వ పంథాను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థలు కూడా రూపాంతరం చెందుతున్నాయని, ఈ క్రమంలో అధికారులు, రాజకీయ నేతలకు విశ్వసనీయతే అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకోవడం ద్వారానే వృత్తిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలి. ఆన్‌లైన్‌లో ఫైళ్ల నిర్వహణ, అవేర్, డేటా లేక్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కచ్చితమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలి" అని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమంగా రాణిస్తున్నారని, ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, ఆ స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు.

## 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్ అవకాశం

అమరావతి : రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22-ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22-ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జీవో నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇకపై ఏదైనా ప్రైవేట్ భూమిని 22-ఏ జాబితాలో చేర్చాలంటే సంబంధిత అధికారే ఆ భూమి స్వభావాన్ని నిరూపించాల్సి ఉంటుందని, అందుకు స్పష్టమైన విధివిధానాలతో జీవో నెం.445 తెచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో పెడితే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వట్టిచెరుకూరు, శెట్టిపల్లి, పుల్లడిగుంట, కంగుంది, అవులపల్లి, గూటుపల్లి సహా కోనసీమ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో వేలాది మందికి ఆస్తులపై హక్కులు పునరుద్ధరించామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే చొరవతో నాలుగు గ్రామాల్లోని రెండు వేల ఎకరాలకు పైగా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికై "మీ భూమి - బ్లాక్‌చైన్ టెక్నాలజీ" ప్రాజెక్ట్ ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నిరంతరం ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వే 2.0ను సమర్ధవంతంగా చేస్తున్నామని, సర్వే శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగడం సంతోషకరమని, అయితే వందశాతం తప్పుల్లేకుండా రీ సర్వే చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

హైదరాబాద్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## స్వచ్ఛతాన్' పోస్టర్‌ను రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్

అమరావతి: సూర్య స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న విజయవాడలో భారీ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛతాన్ పోస్టర్ ని మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట పక్కన గల తమ నివాసంలో ఆవిష్కరించారు. స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌ని కూడా మంత్రి లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఈ ఈవెంట్ నిర్వహించే అమరావతిరన్నర్స్ అధ్యక్షులు రమేష్ రావి, వారి బృందం సభ్యులు పాల్గొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియమ్ వద్ద ఆ రోజు ఉదయం 5 గంటలకు స్వచ్ఛతా రన్ ప్రారంభమవుతుంది. 5కే, 10కే, 21.1కే (ఆఫ్ మేరాతన్) మూడు కేటగిరీలలో ఈ రన్ ని 'అమరావతి రన్నర్స్' వారు నిర్వహిస్తారు. బాలురు, బాలికలు, యువత ... అన్ని వయసుల వారు పాల్గొనడానికి అవకాశం కల్పిస్తారు. పాల్గొనేవారికి టీషర్ట్స్ తోపాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తారు. అన్ని విభాగాలలో విజేతలకు దాదాపు రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారు. పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి. రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మంది స్వచ్ఛతా రన్‌లో పాల్గొనే అవకాశం ఉంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వారికి ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేవిధంగా ప్రోత్సహిస్తారు. విజయవాడలోనే ఇటువంటి రన్ నిర్వహించడం విద్యార్థులకు, యువతకు మంచి అవకాశంగా భావిస్తున్నారు.

## సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

హైదరాబాద్: తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## దుష్ప్రచారాలు నమ్మొద్దు గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## మైనర్ల సోషల్ మీడియా వాడకం... పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు

ఢిల్లీ: సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా వాదనలు వినిపిస్తూ, అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, "భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణ కోసం పటిష్ఠమైన 'ఫైర్‌వాల్స్' ఉండాలని అభిప్రాయపడ్డారు. మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతంగా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## కాకినాడ జిల్లాలో పులి సంచారం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

అమరావతి: కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## గల్వాన్ తర్వాత తొలిసారి.. మోదీ-జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

ఢిల్లీ: ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్-చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ-జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.

## తిరుమల భక్తులకు టీటీడీ భరోసా.. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు!

తిరుపతి: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అదేవిధంగా, కొండపై సహజంగా మరణించే భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశంలోని ఆలయాల పరిపాలనలో ఇలాంటి పథకం అమలు చేయడం ఇదే తొలిసారని టీటీడీ పేర్కొంది. బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించడమే తమ లక్ష్యమని ఛైర్మన్ మీడియాకు తెలిపారు.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్, సీఎం పర్యటన

సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. సెప్టెంబర్ 15న ఉత్సవాల ప్రారంభం రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. సెప్టెంబర్ 16న రిలయన్స్ సంస్థ విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించడంతో పాటు, టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు.

భారీ ఏర్పాట్లు, భద్రత

గతేడాదితో పోలిస్తే ఈసారి గరుడ సేవ రోజున 15-20 శాతం అధికంగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా రోజుకు 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా సిద్ధం చేస్తున్నారు. అన్నప్రసాదం ఏర్పాట్లను కూడా గతేడాది 6.13 లక్షల భోజనాల నుంచి ఈసారి 9.30 లక్షలకు (52% పెరుగుదల) పెంచారు. భద్రతాపరంగా 3,000 మంది పోలీసులు, 2,500 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందిని మోహరిస్తున్నారు. పారిశుద్ధ్యం కోసం అదనంగా 3,300 మంది సిబ్బందిని నియమించారు. తిరుపతి నగరంలో ప్రత్యేక హోల్డింగ్ పాయింట్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా భక్తులను తిరుమలకు తరలించనున్నారు. ఈ సమావేశంలో పాలకమండలి మరికొన్ని కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని రిటైర్డ్ సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లకు వర్తింపజేయడం, అన్నప్రసాదం వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు, నారాయణవనం, చెన్నైలోని శ్రీవారి ఆలయాల్లో బంగారు తాపడం పనులకు ఆమోదం తెలిపారు. యాత్రకు వచ్చి అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ఈ కొత్త బీమా పథకాలు అండగా నిలుస్తాయని టీటీడీ విశ్వాసం వ్యక్తం చేసింది.

## విజయ్‌పై టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు



చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో 'దవడ' వివాదం ఇంకా సద్దుమణగలేదు. ఎంకే స్టాలిన్ దవడ గాయాన్ని సీఎం విజయ్ ఎగతాళి చేశారంటూ రచ్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ సినిమాల్లోనే హీరో.. నిజ జీవితంలో పెద్ద విలన్" అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే నేతల కంటే తీవ్రంగా స్పందించిన దినకరన్.. విజయ్‌ను స్వార్థపరుడిగా అభివర్ణించారు. తన సొంత ప్రయోజనాల కోసం ఎవరినైనా బలి చేస్తారంటూ మండిపడ్డారు. విజయ్ పార్టీ టీవీకే అధికారంలో వచ్చిన తర్వాత తమిళనాడు రాజకీయ వాతావరణం వ్యక్తిగత విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రతిపక్షాలు, ముఖ్యంగా ఎంకే స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్.. నటి త్రిషతో విజయ్‌కు ఉన్న సంబంధాన్ని అడ్డం పెట్టుకుని ఆయన్ని కార్నర్ చేయడానికి ప్రయత్నించగా.. ముఖ్యమంత్రి మాత్రం డీఎంకే చీఫ్‌కు 1976లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో తగిలిన దవడ గాయాన్ని ఎగతాళి చేశారనే ఆరోపణలు వచ్చాయి. సెప్టెంబర్ 7న తమిళనాడు అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష డీఎంకే అవినీతిపై ఆయన విమర్శలు గుప్పిస్తూ ఇచ్చిన బాడీ లాంగ్వేజ్ సైగ.. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగింది. అసెంబ్లీ సమావేశంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ గతంలో ఎమర్జెన్సీ కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, నిర్బంధం గురించి ప్రస్తావిస్తున్న సమయంలో విజయ్ తన దవడను తాకుతూ ఒక రకమైన సైగ చేశారు. విజయ్ చేసిన ఈ బాడీ లాంగ్వేజ్ సైగ.. ఎమర్జెన్సీ (1975-77) కాలంలో 'మీసా' చట్టం కింద అరెస్టై, పోలీస్ కస్టడీలో దాడికి గురై దవడ గాయపడిన ఎంకే స్టాలిన్‌ను అపహాస్యం చేసేలా ఉందని డీఎంకే పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయ్‌పై విమర్శలు గుప్పించిన ఎంకే స్టాలిన్.. అదే సమయంలో తన దవడకు గాయం ఎలా జరిగిందో వివరించారు. 1975-77 మధ్య అమలైన ఎమర్జెన్సీ సమయంలో కరుణానిధి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం రద్దయిన తర్వాత 1976లో తాను అరెస్టయిన విషయాన్ని స్టాలిన్ గుర్తుచేసుకున్నారు. జైలులో మేము ఎన్నో రకాల వేధింపులు ఎదుర్కొన్నాం. మమ్మల్ని కుష్ఠు రోగులతో కలిసి ఉంచారు. పది మందిని ఒక చిన్న గదిలో బంధించారు. ఆ గదిలో ఒకే ఒక మూత్రశాల ఉండేది. చుట్టూ దుర్వాసన ఉన్నప్పటికీ అక్కడే నిద్రించాల్సి వచ్చేదంటూ స్టాలిన్ తెలిపారు. పోలీసులు రాత్రిళ్లు మమ్మల్ని నిద్రపోనివ్వలేదు. లాఠీలతో కొట్టేవారు. జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలతో కూడా మమ్మల్ని కొట్టించారు. నాతో పాటు జైలులో ఉన్న ఎంపీ చిట్టిబాబు అక్కడే మరణించారు. ఆ దాడిలో నా దవడ ఎముక విరిగింది" అని చెప్పారు. విజయ్ తాను ఆ హావభావం చేయలేదన్న వివరణను స్టాలిన్ తోసిపుచ్చారు.

### స్పేస్ పరిశోధనల్లో భారత్‌తో చేతులు కలపండి..

## ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ : అంతరిక్ష రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని, భవిష్యత్ పరిశోధనల్లో భారత్‌కు సహ ప్రయాణికులుగా మారాలని ఫ్రాన్స్,ఇతర దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ అంతరిక్ష సదస్సును (ఇంటర్నేషనల్ స్పేస్ సమ్మిట్) ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. భూమిపై మానవ జీవితానికి అంతరిక్షం ఎంతో కీలకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు ఈ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తిని ప్రేరేపిస్తోందని, నేడు అది వాతావరణం, వ్యవసాయం, సముద్రాలు, సమాజాల అభివృద్ధిని ప్రభావితం చేస్తోందని తెలిపారు. అంతరిక్ష కక్ష్యలు రద్దీగా మారుతున్న తరుణంలో.. ఘర్షణల కంటే సహకారానికి, స్వల్పకాలిక లాభాల కంటే సుస్థిరతకు, మినహాయింపుల కంటే సమ్మిళిత విధానానికి మన ఎంపికలు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని స్పష్టం చేశారు. 1960ల నుంచి భారత్, ఫ్రాన్స్‌లు అంతరిక్ష రంగంలో నమ్మకమైన భాగస్వాములుగా ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ సాంకేతికతను అందించడంలో ఇస్రో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందని ప్రశంసించారు. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కి పైగా ఉపగ్రహాలను భారతీయ రాకెట్లు అంతరిక్షంలోకి విజయవంతంగా చేరవేశాయని తెలిపారు. రైతులు, మత్స్యకారులకు సహాయం చేయడం నుంచి వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వరకు ఇస్రో సాంకేతికతలు కేవలం భారత్‌కే కాకుండా ప్రపంచానికి ఉపయోగపడుతున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ చట్టాలు, చర్చలు, సహకారంతో సురక్షితమైన, శాంతియుతమైన, సుస్థిరమైన అంతరిక్ష రంగాన్ని రూపొందించడానికి భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## ప్రారంభోత్సవానికి రాను, సిగ్గుపడుతున్నా: గడ్కరీ ధ్వజం





ముంబై- గోవా హైవే విస్తరణ పనులు నత్త నడకన సాగుతుండటంపై కేంద్ర రహదారి రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల ఆలస్యంపై ఇక ఎంతమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పనుల్లో విపరీతమైన ఆలస్యం జరగడం పట్ల సిగ్గుపడుతున్నానని, అందుకే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోవడం లేదని ఆయన కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. గోవాలోని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్డు కారిడార్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు తన హెచ్చరికలను కార్యరూపంలోకి తెచ్చేందుకు, గడ్కరీ అక్టోబర్‌లో ముంబై నుండి గోవా వరకు రోడ్డు మార్గంలో ప్రయాణించి ఈ హైవే పనుల పూర్తి పొడవును స్వయంగా తనిఖీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆలస్యానికి, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. తన శాఖకు ఏడు ప్రపంచ రికార్డులు ఉన్నాయి కానీ ఇపుడు ఒకే సంవత్సరంలో అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం, అధికారులను సస్పెండ్ చేయడంలో సరికొత్త రికార్డు సృష్టించాలనుకుంటున్నానంటూ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. అదే సమయంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యాలకు, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని గడ్కరీ తెలిపారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు మహారాష్ట్రలోని తీరప్రాంత కొంకణ్ గుండా వెళుతుంది. భూసేకరణ వివాదాలు, న్యాయపరమైన చిక్కులు, వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడం, అటవీ శాఖ అనుమతులు లభించడంలో ఆలస్యం కావడం వంటి అంశాలు పనుల పురోగతిని దెబ్బతీశాయని గడ్కరీ వివరించారు. ప్రస్తుతం అటవీ శాఖ అనుమతుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గడ్కరీ వివరాల ప్రకారం ఈ హైవే పనులు ప్రస్తుతం సుమారు 93-94 శాతం పూర్తయ్యాయి. గణేష్ ఉత్సవాలకు ముందే సుమారు 90-95 శాతం పనులు పూర్తయ్యాయని మహారాష్ట్ర అధికారులు అంచనా వేశారు. అలాగే చిప్లున్ బైపాస్ వర్షాకాలం తర్వాత ప్రారంభమవుతుందని, మంగావ్ బైపాస్ పనులు జనవరి 2027 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు ఉన్నాయని అంచనా. ఇటీవలి నివేదికల ప్రకారం, ముంబై-గోవా హైవే ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 16,000 కోట్లు ఖర్చు చేశారు. కాగా ముంబై-గోవా హైవే విస్తరణ ప్రాజెక్ట్ దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది. పాత రెండు లేన్ల హైవేను నాలుగు లేన్లుగా మార్చడం ద్వారా ముంబై - గోవా మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపు 12 గంటల నుండి ఆరు గంటలకు తగ్గించే లక్ష్యంతో 2011లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్ట్ మొదట 2016 నాటికి పూర్తవుతుందని భావించినప్పటికీ, ఇంకా అసంపూర్తిగానే ఉంది.

# సూర్యుడికి అద్దం పట్టాల్సిందేనా!

### ముంచుకొస్తున్న భూతాపోన్నతి ప్రభావం
### లక్ష్యాలకు మించి పెరగనున్న ఉష్ణోగ్రతలు
### సౌర వికిరణ మార్గమే శరణ్యం
### దేశాల మధ్య కుదరని ఏకాభిప్రాయం



భూమికి ముప్పు తప్పేట్టు లేదు... భూతాపోన్నతికి పగ్గాలేసే లక్ష్యం గురి తప్పుతోంది! సగటు ఉష్ణోగ్రతలు 1.8 డిగ్రీ సెల్సియస్ వరకూ పెరగడం ఖాయమవుతోంది.

మరి... తరుణోపాయం

భూతాపోన్నతి ప్రభావాలను తట్టుకునేందుకు ప్రపంచం సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కే పరిమితం చేయాలన్న లక్ష్యం నెరవేరే అవకాశాల్లేవు. ఫలితంగా ఈ శతాబ్దం అంతానికి భూమిపై అకాల వర్షాలు, వరదలు, విపరీతమైన వేడి కారణంగా మనిషి బతికే పరిస్థితులు ఉండవన్న శాస్త్రవేత్తల హెచ్చరికలు నిజమవడం తథ్యమన్న అంచనాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంకో రెండు నెలల్లో టర్కీలో వాతావరణ మార్పులపై ఐరాస సదస్సు ఏం చేయబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. భూతాపోన్నతిని తగ్గించేందుకు కర్బన ఉద్గారాలను తగ్గించడం ఒక్కటే మేలైన మార్గం అని అనుకునేవారు. వాతావరణ మార్పులకు తగ్గట్టుగా మనం మారడం, భూతాపోన్నతికి అనుగుణంగా సర్దుకుపోవడాన్ని ఓడిపోవడంగా భావించేవారు. అయితే ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. వాతావరణ మార్పులను అడ్డుకోవడంలో ప్రపంచదేశాలన్నీ విఫలం కావడంతో ఇప్పుడు క్లైమేట్ అడాప్టేషన్ (వాతావరణానికి తగ్గట్టుగా మనం మారడం) అత్యవసరమైన విధానంగా మారిపోయింది. ఫలితంగా ఒకప్పుడు వివాదాస్పదమైన సౌర వికిరణ మార్పు పద్ధతికి ప్రాచుర్యం పెరుగుతోంది.

### సౌర వికిరణ మార్పు అంటే?

సౌర వికిరణ మార్పు లేదా సోలార్ రేడియేషన్ మాడిఫికేషన్ (ఎస్ఆర్ఎం) అంటే సూర్యకాంతిలో కొంత భాగాన్ని మళ్లీ అంతరిక్షంలోకి పంపించడం అన్నమాట. సింపుల్‌గా చెప్పాలంటే సూర్యుడికి అద్దం పట్టడం. అయితే ఇందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భారీ ఏర్పాట్లు అవసరం. భూమిపై పడుతున్న సూర్యరశ?మిలో కనీసం ఒక శాతాన్ని ఇలా వెనక్కు పంపించగలిగితే కర్బన ఉద్గారాల ద్వారా వాతావరణంలోకి చేరిన విషవాయువుల ప్రభావాన్ని తగ్గించవచ్చునని సగటు ఉష్ణోగ్రతలను గణనీయంగా తగ్గించవచ్చునని అంచనా. నేలపై లేదంటే అంతరిక్షంలో భారీసైజున్న అద్దాలు ఏర్పాటు చేసి సూర్యుడి నుంచి పడే కాంతి మళ్లీ అంతరిక్షంలోకి చేరేలా చేయాలని ఆలోచించారు. అలాగే అప్పుడప్పుడూ రసాయన కణాలు చల్లడం ద్వారా మేఘాలు మరింత సౌర రేడియోధార్మికతను వెనక్కు పంపించగలమని అంచనాలున్నాయి. అగ్ని?పర్వతాలు బద్దలైనప్పుడు వెలువడే పొగ ఆకాశాన్ని కమ్మేసి చాలాకాలంపాటు సూర్యరశ్మి కిందపడకుండా చేస్తున్నట్లు అన్నమాట.

### ఇదీ వివాదం...

ఎస్ఆర్ఎం వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది కానీ.. కర్బన ఉద్గారాలను తగ్గించదు. పైగా పర్యావరణ వ్యవస్థలపై దీని ప్రభావం ఏమిటన్నది స్పష్టంగా తెలియదు. ఎలాగూ ఇది ఉందన్న సాకుతో పరిశ్రమలు, ప్రభుత్వాలు వాతావరణంలోకి చేరుతున్న విష వాయువులను తగ్గించడంపై దృష్టి పెట్టవన్నది మరో ఆందోళన. ఎస్ఆర్ఎం పద్ధతిని ఒకసారి వాడి... ఉష్ణోగ్రతలు తగ్గాయి కాబట్టి నిలిపేద్దామనుకుంటే అది కూడా ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉంది. ఈ 'టెర్మినేషన్ షాక్'వల్ల భూమి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది. 2023 నుంచి సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే కొత్త ఇంధన నిబంధనలు అమల్లోకి వచ్?చన తర్వాత ఉష్ణోగ్రతలు వేగంగా పెరగడం ఈ టెర్మినేషన్ షాక్‌ను ధ్రువీకరిస్తున్నాయి. మరోవైపు ఎస్ఆర్ఎం పద్ధతిపై ఇప్పటివరకూ స్పష్టమైన విధానం, మార్గదర్శకాలు, నియంత్రణ వ్యవస్థలు లేవు. ఈ నేపథ్యంలో దీన్ని కర్బన ఉద్గారాల తగ్గింపునకు ప్రత్యామ్నాయంగా కాకుండా.. ఎమర్జెన్సీ ఏర్పాటుగా మాత్రమే చూడాలని కొంతమంది నిపుణులు సూచిస్తున్నారు. 2024లో స్విట్జర్లాండ్ ఎస్ఆర్ఎంపై ఒక ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించగా పలు దేశాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. జపాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు మద్దతివ్వగా, పసిఫిక్, ఆఫ్రికా దేశాలు వ్యతిరేకించాయి. అమెరికాలో అధ్యక్షుడు ట్రంప్‌సహా కొందరు రిపబ్లికన్లు వాతావరణ మార్పులనే కొట్టిపారేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టర్కీలో జరగబోయే వాతావరణ మార్పుల సదస్సు ఎస్ఆర్ఎంపై ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా? అన్నది ఆసక్తికరమైన విషయంగా మారింది.

# పిల్లలు ఏఐ మీద ఎక్కువగా ఆధారపడుతున్నారు!



ఏఐని వేగంగా అందిపుచ్చుకుంటున్నది స్కూల్ పిల్లలే. ఇటీవలి అధ్యయనాల ప్రకారం, పిల్లలు పెద్దల కంటే మూడు రెట్లు వేగంగా కృత్రిమ మేధ సాంకేతికతలను స్వీకరిస్తున్నారు. లక్షలాది మంది పిల్లలు హోంవర్క్ చేయడానికి చాట్‌బాట్‌ల సహాయం తీసుకుంటున్నారు. కౌమారదశలో ఉన్న వారు స్కూల్ ప్రాజెక్టులు చేయడానికి మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితానికి కూడా ఏఐని అనుసంధానం చేస్తున్నారని ఇటీవలి ప్రపంచ స్థాయి గణాంకాలు చూపిస్తున్నాయి. ' లక్షలాదిమంది పిల్లలు తమ సందేహాలు తీర్చుకోవడానికి ఏఐ మీద ఆధారపడుతున్నారు. బాల్యంలో కలిగే సందేహాలు ఒక ఎత్తయితే, కౌమారంలోకి అడుగుపెట్టినప్పుడు అనేక సందేహాలు వేధిస్తుంటాయి. పెద్ద వాళ్ల దగ్గర వ్యక్తం చేయడానికి సంకోచించే సందేహాల నివృత్తి కోసం ఏఐని ఆశ్రయిస్తున్నారు. వ్యక్తిగత ఆందోళనల నుంచి బయటపడడానికి మార్గాలను చూపించమని కోరుతున్నారు. సంక్షోభం నుంచి గట్టెక్కడానికి కూడా చాట్‌బాట్‌లనే ఎంచుకుంటున్నారు. ' యూనిసెఫ్ కొన్ని దేశాల్లో ఏఐ వినియోగం మీద సర్వే నిర్వహించింది. ఈ ఏడాది జూన్‌లో విడుదల చేసిన ఆ నివేదిక ప్రకారం 'పిల్లలు పెద్దవాళ్ల కంటే మూడురెట్లు ఎక్కువ వేగంతో కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుంటున్నారు. 20 మిలియన్లకు పైగా పిల్లలు ఏఐని ఉపయోగిస్తుండగా, వారిలో 13 మిలియన్ల మంది పాఠశాల పని కోసం, 2 మిలియన్ల మంది జీవిత సలహాల కోసం వాడుతున్నారు. ' కెనడా 2026 అధ్యయనం ప్రకారం పిల్లల్లో ఐదుగురిలో ఒకరు ఏఐ నుంచి ఎమోషనల్ సపోర్టు తీసుకుంటున్నారు. ముఖ్యంగా న్యూక్లియర్ కుటుంబాల్లో సింగిల్ చైల్డ్ ఒంటరితనం కారణంగా ఏఐని ఫ్రెండ్‌గా మార్చుకుంటున్నారు. ' కామన్‌సెన్స్ మీడియా, ప్యూ రీసెర్చ్ సెంటర్‌ల సర్వేల నివేదిక ప్రకారం 64 నుంచి 70 శాతం టీనేజర్లు సమాచారం వెతకడానికి, మేధోమథనం చేయడానికి, హోమ్‌వర్క్ చేయడానికి ఏఐ చాట్‌బాట్‌లను వాడుతున్నారు.

### ప్రమాదాలూ ఉన్నాయి!

' కాగ్నిటివ్ ఆఫ్లోడింగ్: ఏఐ షార్ట్‌కట్‌లపై ఎక్కువగా ఆధారపడటం వలన జ్ఞానం మెదడు పొరల్లో దీర్ఘకాలం నిక్షిప్తం కాలేదు. ఏకాగ్రతతో అభ్యసించడం ద్వారా మెదడు అభివృద్ధి చెందుతుంది. ఏఐ ఈ ప్రక్రియకు ఆటంకం.

' ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) వంటి విద్యా నివేదికలు మితిమీరిన ఏఐ వాడకం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రోజువారీ పాఠ్యాంశాల అభ్యాసంలో ఏఐని వాడడం వల్ల పరీక్షల్లో మార్కులు తగ్గడం, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన నైపుణ్యాలు క్షీణించడం వంటి ప్రమాదాలను హెచ్చరిస్తున్నాయి.

' ఏఐ గొప్ప ట్యూటర్‌గా పని చేస్తోంది, తక్షణం ఫలితాలనిస్తుంది. కానీ ఆ సాధనం లేకుండా సొంతంగా మెదడుతో ఆలోచించి పనిచేసే సామర్థ్యాన్ని పెంచడం లేదని అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

' అత్యంత ఆందోళన కలిగించే అంశం తప్పుడు సమాచారం. స్కామ్, సామాజిక అంశాల విషయంలో పక్షపాత ధోరణితో, అర్ధవాస్తవాలతో ఉద్దేశపూర్వకంగా కూర్చిన సమాచారాన్ని నూరుశాతం నిజమని నమ్మే ప్రమాదం లేకపోలేదు.

' బహిర్గతమైన భయాలు: మూడింట ఒక వంతు మంది పిల్లలు ఆన్‌లైన్ మోసాలు, తప్పుడు సమాచారం గురించి ఆందోళన చెందుతుండగా, నాలుగింట ఒక వంతు మంది లైంగికంగా అసభ్యకరమైన డీప్‌ఫేక్‌లకు భయపడుతున్నారు.

### వాస్తవాన్ని గుర్తించడం...

ఏఐ రూపొందించిన కంటెంట్‌ను, మనిషి సృష్టించిన కంటెంట్ నుంచి వేరు చేసి చెప్పడంలో పిల్లలు ఇబ్బంది పడతారు. పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఈ తేడాను గుర్తించే కచ్చితత్వం తగ్గుతుందని 'నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్' చెబుతోంది. ' తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో అభ్యాసం కొనసాగితే అర్ధవాస్తవాలను, పక్షపాత ధోరణి సమాచారాన్ని వడపోసి పిల్లలను కచ్చితమైన సమాచారం వైపు నడిపించడం జరుగుతుంది. ఏఐ విషయంలో అలాంటి భద్రత లేకపోవడం ఆలోచించాల్సిన అంశం అని విద్యావేత్తల సూచన.

# మామిడి పండు చూడ మేలిమై యుండును.. పొట్ట విప్పి చూడ..

### అంతర్జాతీయ ప్రీమియం ఎగుమతి
### మార్కెట్లలో మన మామిడికి తిరస్కరణ..
### పైకి నిగనిగ.. లోపల పురుగులు..
### రసాయనాల వాడకంతో తగ్గుతున్న నాణ్యత..
### సాగు పద్ధతి మార్చాలంటున్న నిపుణులు




(స్పెషల్ డెస్క్) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా ఉంది మన మామిడి సంగతి. ప్రపంచంలోనే రుచికరమైన మామిడి పండ్లను భారత్ ఉత్పత్తి చేస్తోంది. అయినప్పటికీ, అంతర్జాతీయ ప్రీమియం ఎగుమతి మార్కెట్లలో మన మామిడి తీవ్ర ఆంక్షలు, తిరస్కరణలను ఎదుర్కొంటోంది. విదేశీ వినియోగదారులు మంచి ధర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా, నాణ్యత లోపాల వల్ల భారతీయ రైతులు, ఎగుమతిదారులు ఏటా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ సంక్షోభానికి బహుళ కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

### కాంట్రాక్టు సాగుతో కష్టాలు

దేశంలో సుమారు వెయ్యి మామిడి రకాలున్నప్పటికీ, మార్కెట్లో గిరాకీ కలిగినవి 24 ప్రధాన రకాలు మాత్రమే. వీటిల్లో మన తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా సాగయ్యే బంగినపల్లి, చిన్నరసం, పెద్దరసం అగ్రస్థానంలో నిలిచాయి. మామిడి తోటల యజమానుల్లో అత్యధికులు నగరాల్లో నివసిస్తూ తోటలను కాలానికి కాంట్రాక్టర్లకు లీజుకిస్తున్నారు. కేవలం మూడు నెలల సీజన్ లో వచ్చే తాత్కాలిక లాభాలపై తప్ప, తోట దీర్ఘకాలిక ఆరోగ్యంపై కాంట్రాక్టర్లకు శ్రద్ధ ఉండదు. తక్కువ సమయంలో పంటను కాపాడుకోవటానికి విచక్షణారహితంగా సింథటిక్ ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్లు వాడుతున్నారు. నాసిరకం పురుగు మందులను అవసరానికి మించి పిచికారీ చేస్తున్నారు. ఫలితంగా పురుగు మందులను తట్టుకునే శక్తిని చెట్లు పెంచుకుంటున్నాయి. వీటివల్ల కాయ పైకి నిగనిగలాడేలా కనిపించినా, నాణ్యత ఉండటం లేదు. కాయల్లో పండు ఈగ వంటి పురుగులతో పాటు ప్రమాదకర రసాయనాల అవశేషాలు నిండిపోతున్నాయి.

### ఆంక్షలు.. తిరస్కరణలు

పండ్లలో పురుగుల బెడద, అధిక రసాయన అవశేషాల కారణంగా విదేశీ తనిఖీ సంస్థలు భారతీయ మామిడి కన్‌సైన్‌మెంట్లను వెనక్కి పంపుతున్నాయి. వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ కేంద్రాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు లోపించటంతో జపాన్ దిగుమతులను నిలిపివేయగా, అధిక పురుగుమందుల అవశేషాలున్నాయనే ఆరోపణలతో నేపాల్ ఇటీవల సరిహద్దుల్లో కఠిన నిబంధనలు తెచ్చింది. గతంలో యూరోపియన్ యూనియన్ కూడా భారతీయ మామిడిపై నిషేధం విధించింది. అమెరికాకు ఎగుమతి చేయడానికి నిర్దేశించిన నాన్--టారిఫ్ ఆంక్షలు దాటటం సాధారణ రైతులు, ఎగుమతిదారులకు పెనుభారంగా మారింది. ప్రస్తుతం మన ఎగుమతుల్లో మూడోవంతు కేవలం గల్ఫ్ దేశాలకే పరిమితమవుతోంది.

### సాగు పద్ధతి మార్చాలి..

మామిడి రైతులు రసాయన రహిత ఆధునిక సాగు పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి. నిరంతర వ్యక్తిగత పర్యవేక్షణ అత్యవసరం. బాధ్యతారహితంగా తోటలను నిర్వహించే కాంట్రాక్టర్ల చేతులకు తోటలను వదిలేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో క్రిమిసంహారకాల వాడకం తగ్గించి, ఫైటోశానిటరీ ప్రమాణాలు పాటిస్తేనే ప్రపంచ మార్కెట్లో భారతీయ మామిడికి అసలైన గిట్టుబాటు ధర లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

### మౌలిక సదుపాయాలపై దృష్టి కేంద్రీకరించాలి

భూయజమానుల నిర్లక్ష్యం, నాణ్యత లేని రసాయన వ్యవసాయం మన మామిడి ఎగుమతులను దెబ్బ తీస్తున్నాయి. బంగినపల్లికి మంచి నిల్వ సామర్థ్యం ఉన్నా ఏపీ, తెలంగాణల్లో ఇర్రేడియేషన్, ప్యాక్‌హౌస్ వసతులు లేవు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పదేళ్లకు పైగా మామిడి సాగు చేస్తూ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నాను. అమెరికాలో, గల్ఫ్ దేశాల్లో డోర్ డెలివరీ చేస్తున్నాం. ఈ ఏడాది యూరప్‌కూ విస్తరిస్తున్నాం. మామిడి ఎగుమతి సీజన్ కేవలం 45--60 రోజులే. పేపర్‌వర్క్, ఎయిర్ ఫ్రైట్‌పై జీఎస్టీ పెనుభారంగా మారాయి. ప్రభు త్వం రసాయనాలకు సబ్సిడీలు ఆపి, సహజ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. ఎగుమతులు పెంచేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించటంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలి

## జిల్లా యువజన అధికారి ఏ.వి. నరసింహ కుమార్




ఒంగోలు, మహి న్యూస్, సెప్టెంబర్ 10: వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో ప్రకాశం జిల్లాలోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా యువజన అధికారి ఏ.వి. నరసింహ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మేరా యువ భారత్-- ప్రకాశం (ఒంగోలు) కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో యువత పాత్రను మరింత పెంపొందించడంతో పాటు, యువతలో నాయకత్వ లక్షణాలను, సాధారణ జ్ఞానాన్ని మరియు దేశం పట్ల అవగాహనను పెంపొందించే ఉద్దేశంతో వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా యువత కోసం ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలోని 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువత మై భారత్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వివరాలను నమోదు చేసుకుని ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. క్విజ్‌లో మొత్తం 20 ప్రశ్నలు ఉంటాయని, వాటికి సమాధానాలు ఇవ్వడానికి 10 నిమిషాల సమయం కేటాయించబడుతుందని తెలిపారు. క్విజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం పాల్గొనేవారికి సర్టిఫికేట్ కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యువత తమ పరిజ్ఞానాన్ని పరీక్షించుకోవడంతో పాటు, వికసిత్ భారత్ నిర్మాణంపై మరింత అవగాహన పొందేందుకు ఈ క్విజ్ ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రస్తుత యువత దేశ భవిష్యత్తుకు కీలకమని, దేశ అభివృద్ధి, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా యువజన అధికారి తెలిపారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను, ఆలోచనా విధానాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 30వ తేదీ క్విజ్‌లో పాల్గొనేందుకు చివరి గడువు అని జిల్లా యువజన అధికారి స్పష్టం చేశారు. గడువు సమీపిస్తున్నందున జిల్లాలోని అర్హత కలిగిన యువత ఎటువంటి ఆలస్యం చేయకుండా మై భారత్ వెబ్‌సైట్ ద్వారా క్విజ్‌లో పాల్గొనాలని కోరారు. జిల్లాలోని 15--29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనాలని జిల్లా యువజన అధికారి ఏ.వి. నరసింహ కుమార్ కోరారు.

# మట్టి విగ్రహాలే పర్యావరణహిత ప్రత్యామ్నాయం

## అడుగంటిన జలాశయాలు .... ఎట్లా వినాయక నిమజ్జనాలు ?

డా. ముచ్చుకోట సురేష్ బాబు,




నేరడ్ మీట్ మహి న్యూస్ సెప్టెంబర్ 11. దేశంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటే కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో జలాశయాలు అడుగంటిపోతున్నాయి. తెలంగాణలోని పలు నగరాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు కనిపిస్తున్నాయి. వేసవి కాలానికి ఇంకా ఆరు నెలల సమయం ఉండగానే పరిస్థితి ఇలా ఉంటే, మార్చి--ఏప్రిల్ నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడమే ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి అవసరాలకే ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో వ్యవసాయం, పశుపోషణ, పారిశ్రామిక అవసరాల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉంది.తెలంగాణలో వర్షపాతం లోటు 52 శాతంగా, ఆంధ్రప్రదేశ్‌లో 64 శాతంగా ఉందనే గణాంకాలు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. వర్షాకాలంలోనే వర్షాభావం ఇంత తీవ్రంగా ఉంటే, రాబోయే వేసవిని ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.కానీ కరువు ముప్పుపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వాలు కేవలం పరిస్థితి అదుపులోనే ఉందన్న ప్రకటనలు, ప్రెస్‌మీట్‌లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలకు ఉపక్రమించాలి. ముఖ్యంగా రైతులకు ఏ పంటలు సాగు చేయాలి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు ఏమిటి, నీటి సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, పంటల ఎంపికలో ఎలాంటి మార్పులు చేసుకోవాలి అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి.కరువు అంటే కేవలం తాగునీటి కొరత కాదు. అది ఆహార భద్రత, వ్యవసాయం, పశుసంపద, ఉపాధి, ప్రజారోగ్యం వంటి అనేక రంగాలపై ప్రభావం చూపే సంక్షోభం. అందుకే ప్రభుత్వాలు కరువు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా, కరువు రాకముందే నివారణ చర్యలు ప్రారంభించాలి.

### కరువు మధ్య భారీ గణేష్ విగ్రహాల నిమజ్జనమా?

ఒకవైపు ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాల్సిన పరిస్థితి నెలకొంటే, మరోవైపు గణేష్ ఉత్సవాల సందర్భంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి భారీ విగ్రహాలను ఏర్పాటు చేయడం, అనంతరం వాటిని నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం పర్యావరణ పరంగా తీవ్రంగా ఆలోచించాల్సిన అంశం.ఇప్పటికే అనేక చెరువులు, జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోయాయి. అలాంటి పరిస్థితుల్లో భారీ విగ్రహాలను ఎక్కడ, ఎలా నిమజ్జనం చేయాలన్నది ప్రభుత్వాలు ముందుగానే ప్రణాళిక చేయాలి. ముఖ్యంగా తాగునీటి వనరులు, చెరువులు, రిజర్వాయర్లు కలుషితం కాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో సులభంగా కరగకపోవడం వల్ల నిమజ్జనం అనంతరం నీటి వనరుల్లో ఘన వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. విగ్రహాలకు ఉపయోగించే కొన్ని కృత్రిమ రంగులు, పూతలు కూడా నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. నిమజ్జనం జరిగే నీటి వనరులు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది.అందువల్ల గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా పాటించాల్సిన అవసరం ఉంది. భక్తి పేరుతో మన భవిష్యత్ తరాల నీటి వనరులను కలుషితం చేయడం సమర్థనీయం కాదు.

### మట్టి విగ్రహాలే పర్యావరణహిత ప్రత్యామ్నాయం

సహజ మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను ప్రోత్సహించడం ఈ సమస్యకు ఒక ఆచరణాత్మక పరిష్కారం. మట్టి విగ్రహాలు నీటిలో తక్కువ సమయంలోనే విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉండటంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పోలిస్తే పర్యావరణంపై ప్రభావం తక్కువగా ఉంటుంది. సహజ, హానికర రసాయనాలు లేని రంగులను ఉపయోగించడం ద్వారా ఈ ప్రభావాన్ని మరింత తగ్గించవచ్చు.ప్రభుత్వాలు కేవలం ఉత్సవాల సమయంలో నిబంధనలు ప్రకటించడం కాకుండా, ముందుగానే విగ్రహ తయారీదారులను ప్రోత్సహించి పర్యావరణహిత మట్టి విగ్రహాల తయారీ, విక్రయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. స్థానిక సంస్థలు కృత్రిమ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగాన్ని నియంత్రించడంతో పాటు ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు చేయాలి.ఇది భక్తికి వ్యతిరేకమైన చర్య కాదు; భక్తిని ప్రకృతితో సమన్వయం చేసే బాధ్యతాయుతమైన విధానం.ఒకవైపు కరువు ముప్పును ఎదుర్కొంటూ ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని చెబుతూ, మరోవైపు అదే నీటి వనరులను కాలుష్యానికి గురిచేయడం పరస్పర విరుద్ధమైన విధానం. కాబట్టి ఎల్‌నినో, వర్షాభావం, భవిష్యత్ నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు, ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి. నీరు ఉంటేనే జీవనం... నీటిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.

# గ్రామాల్లో విద్యుత్ కోతలు దోమల బెడదతో అల్లాడుతున్న ప్రజలు

## లోడ్ రిలీఫ్ పేరిట పల్లెల్లో కరెంటు కోతను ఎత్తివేయాలి – సిపిఎం

నంద్యాల. లోడ్ రిలీఫ్ పేరిట పల్లెల్లో కరెంటు కోతలను వెంటనే విరమించుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెన్న, బాల వెంకట్ గా తెలియజేశారు గురువారం స్థానిక నంద్యాల పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లెల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల రోడ్లపై నీళ్లు నిలువ ఉండటం వల్ల అక్కడ దోమలు చేరి ప్రజలకు కుట్టడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అంటురోగాలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు వర్షాలు లేక ప్రజలకు పనులు లేక పూట గడవని పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా విద్యుత్ అధికారులు లోడ్ రిలీఫ్ పేరిట పల్లెల్లో కరెంటు ను సాయంత్రం 6 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు కరెంటు కోతలతో పిల్లలు, వృద్ధులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్న స్థానిక అధికార పార్టీ నాయకులు , విద్యుత్ అధికారులు చోద్యం చూస్తున్నారని అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వస్తే నిరంతరం కరెంటు ఇస్తామని చెప్పి గద్దెనెక్కినటువంటి ప్రభుత్వం నిరంతరం రాత్రి సమయాల్లో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో కోతలు విధించడం చాలా దుర్మార్గంగా ఉందని గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహానికి గురికాకుండా విద్యుత్ అధికారులు కరెంటు కోతలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు సంజీవ రాయుడు రామకృష్ణుడు పాల్గొన్నారు ఇట్లు అభివందనంతో సిపిఎం మండల కార్యదర్శి వెన్న బాల వెంకట్ 8639291402

# రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి

### ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి

అమరావతి, మహి న్యూస్, సెప్టెంబర్ 10: శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.

### టీమ్ సక్సెస్‌తోనే అభివృద్ధి

"ఈసారి లీడర్షిప్ అంశంపై కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలి. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉంది. ఉద్యోగుల సామర్థ్యం పెంపు కోసం వివిధ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించాం. డీప్ టెక్ గవర్నెన్స్ ఉంటే అనూహ్యమైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీని వినియోగించడం ద్వారా డేటా లేక్, అవేర్ లాంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం పెరగాలి... సేవల్లో నాణ్యత పెంచాలి. గతంలో 50 ఏళ్లలో చేసే అభివృద్ధిని ఇప్పుడు 10-15 ఏళ్లలోనే సాధించేందుకు ఆస్కారం ఉంది. మనకు వనరులు ఉన్నాయి. టెక్నాలజీ అందుబాటులో ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా 27 నెలల్లో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాం. రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్ కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట ప్రగతి కార్యక్రమాలు చేపట్టాం. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్ -1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టులు పూర్తిచేశాం. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసి గుంటూరు, విజయవాడకు రాజధానిని కనెక్ట్ చేశాం. ఎకనామిక్ టైమ్స్ పత్రిక సీఈఓ టూ వాటర్‌మాన్ అంటూ కథనం రాసింది. సంతోషం కలిగింది. గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు, సీఈఓ సీఎం అన్నప్పుడు కూడా నేను ఇంత ఆనందించలేదు. రాష్ట్రంలోని భౌగోళిక అసమానతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి ఉంది... దానిని సరిచేస్తూ నీటిని ఆయా ప్రాంతాలకు నీటిని ఇవ్వగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి- కావేరీ- మహానది- గంగా లాంటి నదులు అనుసంధానమై వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్ స్టాపబుల్. ఈ నీటి భద్రత, సంరక్షణా చర్యల్ని గుర్తించి వాటర్ మాన్ గా పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది. 36 ప్రాజెక్టులు చేపట్టేందుకు క్యాలెండర్ కూడా ఇచ్చాం. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత అందరి మీద ఉంది. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారం అధికారుల తోడ్పాటుతో ఈ విజయాలను సాధించగలిగాం. ఇప్పటి దాకా సాధించిన ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు.. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు.. ఇలా అందరి వల్ల సాధ్యమైంది.. ఈ విజయం టీమ్ సక్సెస్." అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృద్ధి సాధించండి

"మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రో యాక్టివ్ గవర్నెన్స్ ఉండాలి. ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అంటే అభివృద్ధి-పాలన పెండింగ్ లో ఉన్నట్టే. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంటుంది. నాకు పరిపాలన కంటే సుపరిపాలన ముఖ్యం. మంత్రులు, అధికారులు, కలెక్టర్లు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో.. అభివృద్ధి సాధించే విషయంలో పోటీ పడాలి."అని ముఖ్యమంత్రి వివరించారు.

### నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం

"ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జీఎస్డీపీని కూడా లెక్కించి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం. 2022-23 బేస్ ఇయర్ గా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 13.44 శాతం వృద్ధి రేటు నమోదైంది. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదు అయ్యింది. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25,450 కోట్ల మేర పెరిగాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణల్ని అమలు చేస్తున్నాం. 120 ఏళ్ల నాటి భూ సమస్యల్ని కూడా పరిష్కరిస్తున్నాం. 1908 నుంచి అమలాపురంలో గ్రౌండ్ రెంట్ భూముల విషయంలో నిర్ణయం తీసుకుని 1,416 మందికి పట్టాలు ఇచ్చాం. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసే బాధ్యత మనందరిది. పాలన అంటే గుడ్డిగా పనిచేయటం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలి. బెస్ట్ పాలసీలు తెచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేయాలి. కొత్త ఆలోచన- కొత్త ఆవిష్కరణలతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రస్తుతం 13.44 శాతం వృద్ధి నమోదైంది. దీనిని 15 శాతం దిశగా తీసుకెళ్దాం." అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

### ఇద్దరు మహిళా అధికారులకు సీఎం ప్రశంసలు

"కొందరు వ్యక్తులు ఫేక్ ప్రచారంతో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వేగంగా స్పందిస్తే దానికి కౌంటర్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. సరైన సమయంలో స్పందించకపోతే ఆ శిక్ష ప్రభుత్వానికి పడుతుంది. కొందరు రాజకీయాలు చేస్తూ తప్పు దోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. డీఎస్సీ-2025లో ఎక్కడా తప్పు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలిచ్చాం. కానీ కొందరు అదే పనిగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దీనిపై ఇద్దరు మహిళా అధికారులు చక్కగా స్పందించి కౌంటర్ ఇచ్చారు... వారిని అభినందిస్తున్నా. ఉద్యోగాలు వచ్చిన ఉపాధ్యాయులు కొండారెడ్డి బురుజు, విజయవాడ అంబేద్కర్ విగ్రహం, విశాఖ బీచ్ రోడ్డులో ఆరోపణలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. దుష్ప్రచారం ఆపకపోతే వారి పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని నినదించారు. గత ప్రభుత్వం నిర్వాకంతో మార్కెట్టులోకి వచ్చిన జే బ్రాండ్ మద్యం వల్ల 30 వేల మంది చనిపోయారు. వారి ఆరోగ్యం కూడా దెబ్బతింది. కల్తీ బ్రాండ్లన్నీ రద్దు చేసి పారదర్శకంగా విక్రయాలు జరిగేలా చూస్తున్నాం. విద్యుత్ టారిఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో కారణంగా నీటి భద్రత ఓ సవాలుగా మారింది. 54 శాతం లోటు వర్షపాతం ఈసారి రాష్ట్రంలో నమోదైంది. గతేడాది ఇదే సమయానికి రిజర్వాయర్లలో 85 శాతం నీటి నిల్వలు ఉంటే ఈసారి మాత్రం 57 శాతం మాత్రమే ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం లాంటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జల్ జీవన్ లాంటి మిషన్ను గత ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకోలేదు. అవి చేసి ఉంటే నీటి భద్రతకు ఆస్కారం ఉండేది. ప్రతీ ఇంటికీ కుళాయి ద్వారా నీరివ్వగలిగే వాళ్లం. తాగు నీటి సరఫరా విషయంలో ఎలాంటి రాజీ లేదు. పీఎండీఎస్, ప్రకృతి సేద్యం ద్వారా ప్రతీ ఎకరానూ సాగులోకి తీసుకురావాలి. సంక్షోభంలోనే కలెక్టర్ల నాయకత్వం వెలుగు చూడాలి."అని సీఎం చంద్రబాబు అన్నారు.

### సీఈఓ టు వాటర్ మ్యాన్

ఎకనమిక్ టైమ్స్ లో వచ్చిన వాటర్ మ్యాన్ ఆర్టికల్ గురించి కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. సాగునీటి రంగంలో సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందిస్తూ కలెక్టర్ల కాన్ఫరెన్సులో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..."నీటి వనరుల రంగంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల గురించి వివిధ రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్సులోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అందుకే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగాం. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సృష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ అదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తరలించగలిగాం. ప్రకాశం బ్యారేజీని 200 సార్లు ఇప్పటి వరకూ నింపగలిగాం. డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన నిశ్శబ్ద నీటి ప్రయాణాన్ని రాష్ట్ర ప్రజలు, దేశం కూడా గుర్తించింది. రైతుల గురించి సీఎం పడుతున్న నిరంతర తపనను ఎకనమిక్ టైమ్స్ పత్రిక వాటర్ మాన్ గా ఆయన్ను కీర్తిస్తూ కథనం రాసింది. ఇది సీఎం సాధించిన విజయం.. ముఖ్యమంత్రి విజయంలో ఏపీ అభివృద్ధి ఉంది." అని మంత్రి అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పని పూర్తయ్యే వరకు కాదు.. ప్రజలకు ఫలితం అందే వరకూ పర్యవేక్షణ ఉండాలి

## పిఠాపురం ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 10 : పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గవ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేరళలో చికిత్స పొందుతున్న పవన్ కళ్యాణ్ అక్కడి నుంచి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఏ పనులు పూర్తయ్యాయి, ఏవి పురోగతిలో ఉన్నాయి, తదుపరి కార్యాచరణ ఏ చర్యలు తీసుకోవాల్సి ఉంది లాంటి అంశాల గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, అవసరమైన పరిపాలనా, సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతులపై సమీక్ష

నియోజకవర్గంలోని పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణం ఎంత వరకు పూర్తయిందని అధికారులను పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. అధికారులు పాఠశాలలవారీగా పనుల పురోగతిని వివరించగా, మిగిలిన పనులను కూడా వేగవంతం చేసి విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. పాఠశాలల అప్‌గ్రేడేషన్, అదనపు తరగతి గదులు, ఆటస్థలాల అభివృద్ధి, రక్షణ గోడల కోసం రూ.3.5 కోట్లతో చేపట్టిన పనుల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అదేవిధంగా, యు. కొత్తపల్లి మండలం మూలపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.1.34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎనిమిది అదనపు తరగతి గదుల పనుల ప్రక్రియను వేగవంతం చేసి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పవన్ కళ్యాణ్ సూచించారు. వీధి దీపాలు, సీసీ డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యానికి సంబంధించిన పనుల పురోగతిని అధికారులు వివరించారు. ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి అక్కడి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల ఆధునీకీకరణ పనుల పరిస్థితిని కూడా అడిగి తెలుసుకుని, పనులు పూర్తయిన వెంటనే ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి

శ్మశాన వాటికల నిర్మాణం, అభివృద్ధి పనుల వివరాలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. శ్మశాన వాటికల్లో ట్యాపులు, తాగునీటి సదుపాయం, పారిశుధ్యం తదితర కనీస వసతులను మెరుగుపరచాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లోని శ్మశాన వాటికలను గుర్తించి, అక్కడి మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాల్లో జరుగుతున్న మరమ్మతులు, అభివృద్ధి పనులపై సమీక్షించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ల నిర్మాణాలపై అధికారులు పురోగతిని వివరించారు. నిలిచిపోయిన పనులకు కారణాలను తెలుసుకున్న పవన్ కళ్యాణ్, అవసరమైన అనుమతులు, ప్రక్రియలను పూర్తి చేసి ప్రజా సేవలకు ఉపయోగపడే కేంద్రాలను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

పిఠాపురం, గొల్లప్రోలు అభివృద్ధి పనుల వివరాలు

పిఠాపురం మున్సిపాలిటీలో సుమారు రూ. 300 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. గొల్లప్రోలు మున్సిపాలిటీలో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, పారిశుధ్యానికి సంబంధించి రూ.100 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి ప్రజలకు ఉపయోగపడేలా పనులు నాణ్యతతో పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు.

ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై పవన్ కళ్యాణ్ అధికారులతో సమీక్షించారు. రూ.30.66 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితి, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనుల వివరాలను అధికారులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. ఇందులో 24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు, టీటీడీ కళ్యాణ మండపానికి రూ.2 కోట్లు, 48 భజన మందిరాల అభివృద్ధికి రూ.11.60 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఆయా పనుల పురోగతిని సమీక్షించిన పవన్ కళ్యాణ్, భక్తులకు మెరుగైన వసతులు అందేలా పనులను నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఆర్.ఓ.బి. నిర్మాణంపై ప్రత్యేకంగా ఆరా

రూ.118 కోట్ల అంచనా వ్యయంతో పిఠాపురంలో చేపట్టనున్న రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించిన ప్రస్తుత స్థితి, ఇప్పటివరకు పూర్తయిన ప్రక్రియ, ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలను అధికారులు పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి గతిశక్తి పథకం కిందకు తీసుకురావడంతో నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి సమకూరాల్సి ఉందని తెలిపారు. ఆర్.ఓ.బి నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనల నివేదికను ఇప్పటికే సిద్ధం చేసి, రైల్వే బోర్డు ఆమోదం కోసం పంపినట్లు వివరించారు. పరిపాలనా, సాంకేతిక, సమన్వయపరమైన అంశాలను త్వరగా పరిష్కరించి ఆర్.ఓ.బి. నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

పాడా రూ.50 కోట్ల నిధులపై సమీక్ష

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద మంజూరైన రూ.50 కోట్ల క్రిటికల్ గ్యాప్ ఫండింగ్ వినియోగానికి సంబంధించిన వివరాలను అధికారులు పవన్ కళ్యాణ్ వివరించారు. ఇందులో పిఠాపురం బస్టాండ్ ఆధునీకరణకు రూ.20 కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ.3.5 కోట్లు, స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు రూ.2 కోట్లు, ఫిష్ మార్కెట్ ఆధునీకరణకు రూ.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా పాడా పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఇప్పటి వరకు మొత్తం రూ.1,026.34 కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.323 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఉప్పాడ సముద్ర రక్షణ గోడ నిర్మాణం కూడా ఉందని వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో రూ. 703.34 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. మంజూరైన నిధులను సద్వినియోగం చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు.

పారిశుధ్య వ్యవస్థ బలోపేతంపై ఆదేశాలు

పిఠాపురం మున్సిపాలిటీలో ఘనవ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య వ్యవస్థపై అధికారులు పవన్ కళ్యాణ్ వివరాలు అందించారు. వ్యర్థాల నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు బేలింగ్ మిషన్ మంజూరైనట్లు తెలిపారు. అలాగే పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల పరిధిలోని చిన్నజగ్గంపేట, అగ్రహారం, జగ్గయ్యచెరువు, రకాలపేట, పోస్ట్ ఆఫీసు వీధి ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు మంజూరైనట్లు అధికారులు వివరించారు. మంజూరైన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన గ్రౌండింగ్ చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

ఆయుష్ మెడికల్ కాలేజీ పురోగతిపై ఆరా

రూ. 100 కోట్లతో పిఠాపురంలో ప్రతిపాదిత ఆయుష్ మెడికల్ కాలేజీకి సంబంధించి భూసేకరణ, అనుమతుల పరిస్థితిని అధికారులు వివరించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు త్వరగా పొందేలా సమన్వయంతో పనిచేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తయి వాటి ఫలాలు ప్రజలకు చేరేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

హ్యాండ్లూమ్ సెంటర్ పనులు వేగవంతం చేయండి

చేనేత కార్మికులకు ఆధునిక వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన హ్యాండ్లూమ్ సెంటర్ పురోగతిపై రాష్ట్ర పవన్ కళ్యాణ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ కేంద్రం నిర్మాణానికి సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన అన్ని రకాల సాంకేతిక, పరిపాలనా అనుమతులను త్వరితగతిన సాధించాలని, ఎక్కడా ఆలస్యం కాకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మత్స్యకారుల సంక్షేమ పనుల పురోగతిపై సమీక్ష

మత్స్యకారుల జీవనోపాధి, సంక్షేమం, భద్రతకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిపై పవన్ కళ్యాణ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.26.32 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులు ఆయనకు వివరించారు. వేట నిషేధ భృతి, విభిన్న సబ్సిడీల కింద రూ.19.11 కోట్లు, మత్స్యకారుల భద్రత, పరిహారాల కోసం రూ.3.12 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. యు.కొత్తపల్లి మండలంలో 1,258 బోట్లకు లైఫ్ జాకెట్లు, ఐస్ బాక్సుల సరఫరా, 5 బయోఫ్లోక్ యూనిట్లు, 76 డ్రై ఫిష్ యూనిట్లు, ముఖ్యంగా మత్స్యకార మహిళలు చేపల రవాణా, విక్రయాలు సులువుగా చేసుకునేందుకు వీలుగా 30 హోండా ద్విచక్ర వాహనాల పంపిణీ పనులు కూడా ప్రగతిలో ఉన్నట్లు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో, పూర్తిస్థాయిలో అందేలా చూడాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అలాగే పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## మహిళ స్వయం ఉపాధికి పలు కోర్సులు



గుంటూరు , మహి న్యూస్ సెప్టెంబర్ 10 : మహిళల స్వయం ఉపాధికి కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ పీతల సుజాత అన్నారు. గుంటూరులో గల మహిళా సహకార ఆర్థిక సంస్థ కార్యాలయాన్ని గురువారం చైర్ పర్సన్ సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో వివిధ అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. చైర్పర్సన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి, రక్షణకు పెద్ద పీట వేస్తుందని చెప్పారు. మహిళా సహకార ఆర్థిక సంస్థ ద్వారా ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు. 2026 - 27 ఆర్థిక సంవత్సరంలో మహిళా ఆర్థిక సంస్థ ద్వారా ఒక్కొక్క మహిళా ప్రాంగణానికి ఐదు శిక్షణా కార్యక్రమాలు చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే పలు కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. కొన్ని శిక్షణా కార్యక్రమాలకు ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఉపయోగపడే ఫ్యాబ్రిక్ కట్టర్, సూయింగ్ మిషన్ ఆపరేటర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ క్రెచ్ కేర్ టేకర్, వృద్ధుల, చిన్నపిల్లల కేర్ టేకర్ మొదలగు అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలను మహిళలు సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ఆదాయం పొంది ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయగలరని అన్నారు. వృత్తి విద్యతోపాటు మహిళల సౌకర్యార్థం ఉచిత నివాసంను శక్తి సదన్ లలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు బాల శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందాలి



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 10 : విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందాలని రాష్ట్ర ఆహార కమీషన్ చైర్మన్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన చైర్మన్ ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గాల పరిధిలో



పెదనందిపాడు, ఏటుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, తెనాలి మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ రేషన్ షాపులు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల (బాలికలు), ఎస్సీ, బీసీ, వెల్ఫేర్ హాస్టల్స్ (బాలురు, బాలికలు) లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆహార పదార్థాల నాణ్యత, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించడం వలన చక్కటి ఆరోగ్యంతో విద్యపై దృష్టి సాధించగలరని అన్నారు. విద్యా బోధన పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు పొందే విధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, ఆహార తనిఖీ అధికారులు, కొలతలు తూనికల అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 18లోగా సీలింగ్ భూముల దరఖాస్తులపై అభ్యంతరాలు తెలపాలి



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 10 : పట్టణ భూ పరిమితుల చట్టం, 1976 క్రింద ప్రభుత్వ పరిధిలోకి వచ్చిన సీలింగ్ భూములు, మిగులు భూములు క్రమబద్ధీకరణకు 335 మంది దరఖాస్తులు సమర్పించారని జాయింట్ కలెక్టర్ మరియు అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధీకృత అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఉంటే ఈ నెల 18వ తేదీ లోగా సమర్పించాలని కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీలింగ్ భూములు, మిగులు భూములు క్రమబద్ధీకరణకు గతంలో ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.యం.యస్.నెం.36కు కొన్ని సవరణలు చేస్తూ ఆయా భూములను క్రమబద్ధీకరణ చేసుకొనుటకు జి.ఓ.యం యస్.నెం.84 రెవిన్యూ (భూములు-VI) శాఖ, తేది.24.02.2023 ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వివరించారు. తదనుగుణంగా జి.ఓ.యం యస్.నెం. 27 రెవిన్యూ (భూములు-VI) శాఖ, తేది. 27.01.2025 ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఈ ఉత్తర్వులు మేరకు సీలింగ్ భూములు క్రమబద్ధీకరణకు దాఖలుచేసిన ఆర్జీలను అర్బన్ ల్యాండ్ సీలింగ్ జిల్లా స్థాయి పరిశీలనా కమిటీ జిల్లా కలెక్టరు మరియు చైర్మన్ నేతృత్వంలో విచారణ చేసి రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమీషనరుకు పంపించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 335 మంది దరఖాస్తులు సమర్పించారని, వాటిని ప్రజల పరిశీలనకు గుంటూరు జిల్లా అధికారిక వెబ్ సైట్ www.guntur.ap.gov.in లో పొందుపరచడం జరిగిందన్నారు. వీటిపై ఎవరికైనా ఏదేని అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్ మరియు అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధీకృత అధికారి కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ లోగా లిఖిత పూర్వకంగా సమర్పించాలని తెలిపారు.

## 12న జాతీయ లోక్ అదాలత్




గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 10 : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ పై గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జాతీయ లోక్ అదాలత్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్ సేవలను పొందుటకు కోర్టు ఫీజు లేదని, పరస్పర అంగీకారంతో పరిష్కారం అవుతుందని, త్వరితగతిన న్యాయం లభిస్తుందని చెప్పారు. అన్ని కోర్టుల పరిధిలో జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 23 తేదిన తపాల అదాలత్

శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 10: శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాల సేవలకు సంబంధించి వినియోగదారులు యొక్క వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించు నిమిత్తం సెప్టెంబర్ 23వ తేదిన మధ్యానం 2 గంటలకి రెల్ల వీధిలో ఉన్న సూపరింటెండెంట్ వారి కార్యాలయం వద్ద తపాల అదాలత్ నిర్వహించబడునని పోస్టల్ సూపరింటెండెంట్ వి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. తపాల సేవలకు సంబంధించిన ప్రత్యేక,వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్ నందు చర్చించబడునని, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాల వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు ఈనెల 22వ తేది లోగా "తపాల అదాలత్" అనే శీర్షికతో "వి హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ ఆఫీసస్, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్-శ్రీకాకుళం- 532001" అనే చిరునామకు పంపించాలని ఆయన తెలిపారు. గడువు తేది ముగిసిన తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొన్నారు. ఫిర్యాదులు వ్యక్తిగతంగా కూడా తీసుకొని తపాల అదాలత్ కు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. ఆర్థిక అవకతవకలు సంబందించిన విషయములపై పిర్యాదులు తీసుకోబడవని ఆయన తెలిపారు.

## సెప్టెంబర్ 11 నుంచి కుష్టు నివారణ పక్షోత్సవాలు

### అదనపు వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ తాడేల శ్రీకాంత్

శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 10: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలనా పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తాడేల శ్రీకాంత్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ పక్షోత్సవాల్లో భాగంగా ఆశా కార్యకర్తలు, మగ వాలంటీర్లతో కూడిన బృందాలు ప్రతిరోజూ 20 నుంచి 25 గృహాలను సందర్శిస్తాయి. సాధారణ చర్మ వ్యాధి ఉన్నా లెప్రసీగా అనుమానించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేస్తారు. ఏఎన్ఎమ్‌ల ద్వారా బాధితుల వివరాలను ఆన్‌లైన్‌లో 'అభా' ఐడీ సాయంతో నమోదు చేస్తారని చెప్పారు. రిఫర్ చేసిన కేసులను పీహెచ్‌సీల్లోని వైద్యాధికారులు పరిశీలించి, నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందించి ఫాలోఅప్ నిర్వహిస్తారన్నారు. 15 రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కుష్టు వ్యాధికి సంపూర్ణ చికిత్స అందుబాటులో ఉందని డాక్టర్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. బహుళౌషధ చికిత్స (ఎమ్‌డీటీ) ద్వారా 6 నుంచి 12 నెలల్లో ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే అంగవైకల్యానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. వ్యాధిపై ఎటువంటి భయాలు, సందేహాలు పెట్టుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

## విద్యా వికాసానికి వెలుగుదీపం.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

### పీజీ కేంద్రం నుంచి సంపూర్ణ విశ్వవిద్యాలయంగా అంచెలంచెలుగా ప్రస్థానం

### విద్య, పరిశోధన, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రత్యేక గుర్తింపు

### స్వర్ణోత్సవ వేళ ఘన చరిత్రకు సరికొత్త స్ఫూర్తి

### రేపు స్వర్ణోత్సవ స్మారక చిహ్నం ఆవిష్కరణ.. ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్

గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబరు 10: గుంటూరు ప్రాంతంలో ఉన్నత విద్యకు బలమైన పునాది వేసిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఐదు దశాబ్దాల ప్రస్థానంలో విద్య, పరిశోధన, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట గుర్తింపును సొంతం చేసుకుంది. చిన్న స్నాతకోత్తర కేంద్రంగా ప్రారంభమైన ప్రస్థానం.. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ స్వయంప్రతిపత్తి కలిగిన విద్యా కేంద్రంగా, అనంతరం సంపూర్ణ విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది. 1976లో ఏర్పాటైన విశ్వవిద్యాలయం ప్రస్తుతం స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకుంటోంది.

### ఆనాటి ప్రతిపాదన.. నేటి మహా విద్యాసంస్థ

గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యార్థులు స్నాతకోత్తర విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో 1956 డిసెంబరులో జరిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ సమావేశంలో కళాప్రపూర్ణ వావిలాల గోపాలకృష్ణయ్య గుంటూరులో స్నాతకోత్తర కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అనంతరం ఆచార్య ఎస్. గోపాల్ నేతృత్వంలోని కమిటీ చేసిన సూచనలతో స్నాతకోత్తర కేంద్రం ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

### తొమ్మిది కోర్సులతో తొలి అడుగు

1967లో ఆచార్య ఎస్. మీనాక్షిసుందరం ప్రత్యేకాధికారిగా




నియమితులై గుంటూరుకు వచ్చారు. తొలుత గుంటూరు వైద్య కళాశాలలో కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అనంతరం నల్లపాడులోని ఎం.బి.టి.ఎస్. పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని ప్రత్యేక భవనంలో స్నాతకోత్తర కేంద్రం ప్రారంభమైంది. తొమ్మిది స్నాతకోత్తర కోర్సులతో మొదలైన ఈ కేంద్రం ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యకు కొత్త బాటలు వేసింది.

### 300 ఎకరాల్లో విశాల ప్రాంగణం

తదుపరి కాజ--నంబూరు ప్రాంతంలో సుమారు 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయానికి శాశ్వత ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. మౌలిక వసతులతో పాటు పెద్దఎత్తున మొక్కలు నాటడంతో నేడు ప్రాంగణం పచ్చదనంతో కళకళలాడుతోంది. విద్యాభ్యాసానికి అనువైన ఆహ్లాదకర వాతావరణంతో విశ్వవిద్యాలయం ప్రత్యేక గుర్తింపు పొందింది.

### స్నాతకోత్తర కేంద్రం నుంచి విశ్వవిద్యాలయంగా..

1976లో 16వ శాసనం ద్వారా స్నాతకోత్తర కేంద్రానికి స్వయంప్రతిపత్తి లభించింది. ఆచార్య ఉప్పలపాటి బాలయ్య డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 1976 ఆగస్టులో 43వ శాసనం ద్వారా నాగార్జున విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 1976 సెప్టెంబరు 11న అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయం లాంఛనంగా ప్రారంభమైంది. తొలి ఉపకులపతిగా ఆచార్య ఉప్పలపాటి బాలయ్య బాధ్యతలు చేపట్టారు. పరిశోధనకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ విశ్వవిద్యాలయాన్ని జ్ఞానకేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆయన కృషి చేశారు.

### స్వర్ణోత్సవ స్మారక చిహ్నం ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా స్వర్ణోత్సవ స్మారక చిహ్నం ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఆర్. శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం తెలిపారు.

### ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కులపతి, భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన చేతుల మీదుగా స్వర్ణోత్సవ స్మారక చిహ్నాన్ని ఆవిష్కరించనున్నారు.

### ఘనంగా ఏర్పాట్లు

శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డా. హెచ్. హెచ్. డైక్ మాన్, డా. ఎస్. జాన్ డేవిడ్ ఆడిటోరియంలో కార్యక్రమం జరగనుంది. గవర్నర్ హాజరు నేపథ్యంలో విశ్వవిద్యాలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### ఐదు దశాబ్దాల ఘనతకు ప్రతీక

1976 నుంచి 2026 వరకు ఐదు దశాబ్దాలుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్య, పరిశోధన, విజ్ఞానాభివృద్ధి, క్రీడలు, సాంస్కృతిక, సమాజ సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. విశ్వవిద్యాలయ చారిత్రక ప్రస్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలకు ప్రతీకగా స్వర్ణోత్సవ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. స్మారక చిహ్నం ఆవిష్కరణతో స్వర్ణోత్సవ వేడుకలకు మరింత వైభవం చేకూరనుంది.

## వినాయక చతుర్థి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను మాత్రమే వినియోగించాలి

### నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ

గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 10: వినాయక చతుర్థి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు వినాయక చతుర్థి పండుగ నిర్వహణ, విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ తో కలసి నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 3 వేలకు పైగా గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండపాల వద్ద భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్,



ఇరిగేషన్, మత్స్య, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు.

### నిమజ్జనం కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు

జిల్లాలో గుర్తించిన 8 ముఖ్యమైన నిమజ్జన కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. నిమజ్జనం జరిగే చెరువుల్లో తగినంత నీటి నిల్వలు ఉండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలను పటిష్టం చేయాలన్నారు.

### బోట్లలో ఇద్దరు స్విమ్మర్లు తప్పనిసరి

నిమజ్జన కేంద్రాల వద్ద మత్స్య శాఖ ఆధ్వర్యంలో అవసరమైన



సంఖ్యలో బోట్లు ఏర్పాటు చేయాలని, ప్రతి బోటులో ఇద్దరు శిక్షణ పొందిన స్విమ్మర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

### రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలకు అనుమతి లేదు

గణేష్ మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై ఉన్న నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగం నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించకుండా నిర్వాహకులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు, విద్యార్థులకు, వృద్ధులకు, అనారోగ్యంతో ఉన్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని గణేష్ మండపాల నిర్వాహకులకు జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### మట్టి విగ్రహాలనే వినియోగించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర కాలుష్యానికి కారణమయ్యే పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయం, జేకేసీ కళాశాల రోడ్డు, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని కోరారు. వినాయక చతుర్థి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా గణేష్ ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారుచేసిన పర్యావరణ అనుకూల వినాయక



చవితిని జరుపుకుందామనే వాల్ పోస్టర్ ను అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె.ఖాజావలి, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నజీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్ బి డి ఎస్ పి అళహరి శ్రీనివాసరావు, ఇతరులు పాల్గొన్నారు.

## జీవితం అమూల్యమైనది.. ప్రతి ప్రాణాన్నీ కాపాడుకుందాం




ఎచ్చెర్ల, మహి న్యూస్, సెప్టెంబర్ 10: జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నీ తాత్కాలికమేనని, క్లిష్ట సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా నిలబడి ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రామ్ అధికారిణి శివరంజిని ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ఏటా 1,70,746 మంది ఆత్మహత్యల వల్ల మరణిస్తున్నారని, అందులో 18 నుండి 45 ఏళ్ల మధ్య వయస్కులే ఎక్కువగా ఉండటం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. విపరీతమైన ఒత్తిడి, భయం, క్రుంగుబాటు, వ్యసనాలు, క్షణికావేశమే ఇందుకు ప్రధాన కారణాలని, బాధితులకు స్నేహపూర్వకంగా ఆసరాగా నిలిచి మానసిక నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తే ఆత్మహత్యలను నివారించవచ్చని స్పష్టం చేశారు. మానసిక సమస్యలతో బాధపడేవారు ఉచిత టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించి నిపుణుల సలహాలు పొందవచ్చని, జిల్లా సామాజిక ఆస్పత్రుల్లో మానసిక వైద్యులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల వైద్యాధికారులు డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ గంగా ప్రియదర్శిని, డిప్యూటీ హెచ్‌ఈఓ పి. మోహిని రత్నకుమారి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు, క్రమబద్ధీకరణ జాబితాను సిద్ధం చేయండి

### - ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి/కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 10 :- రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై చర్చించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వచ్చే నెల 15వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎంతమందికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.. ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీకరించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇళ్ల పట్టా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల పూర్తి వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక


# జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయంతో కృషి చేయాలి

## పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, ఎక్సైజ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



కర్నూలు, సెప్టెంబర్ 10: (మహి న్యూస్): సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసు, న్యాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఫుల్ అడిషనల్ చార్జ్‌లో ఉన్న ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ పి. వాసు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ఏర్పాట్లపై గురువారం కర్నూలు జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రితో కలిసి కర్నూలు అదనపు పోలీసు సూపరింటెండెంట్ హుస్సేన్ పీరా, కోర్టు పర్యవేక్షణ విభాగం ఇన్‌స్పెక్టర్ రామయ్య నాయుడుతో సమావేశమయ్యారు.



ఈ సందర్భంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని లోక్ అదాలత్‌లో అత్యధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

### ఉమ్మడి జిల్లాల్లో 31 లోక్ అదాలత్ బెంచీలు

కక్షిదారుల సౌకర్యార్థం తమ కేసులను సులభంగా పరిష్కరించుకునేందుకు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 31 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకునేందుకు కక్షిదారులకు మంచి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 12న శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని న్యాయ, పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు.

# పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



కర్నూలు, సెప్టెంబర్ 10: (మహి న్యూస్): కర్నూలు ఏ. క్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు ప్రాంతీయ కార్యాలయం, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 117, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.




ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. సహజసిద్ధమైన మట్టితో



తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. విద్యార్థులు, ప్రజల్లో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, కాలుష్య నివారణ, కార్మిక హక్కులు, వినియోగదారుల రక్షణ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే న్యాయ సేవల ఉచిత సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యనిర్వాహక ఇంజినీర్ కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుతూ భక్తిని కొనసాగించేలా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని కోరారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పర్యావరణ స్పృహ, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు మట్టి విగ్రహాల తయారీ పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాబోయే తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం విద్యార్థులతో "మట్టి విగ్రహాలనే పూజిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యనిర్వాహక ఇంజినీర్ కిషోర్ కుమార్ రెడ్డి, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ రామకృష్ణ, శాస్త్రవేత్త నరసింహులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది బద్దల్ లక్ష్మీనారాయణ, మాంటిస్సోరి హైస్కూల్స్ అధినేత కృష్ణమోహన్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నా పొలం నాకు ఇప్పించాలని దళిత మహిళ ఆవేదన

## అధికారులు నాయకులు ఒకటే నా పొలాన్ని వేరొకరికెక్కించారు

## నా పొలం నాకు ఇప్పించి న్యాయం చేయాలని అధికారులకు విన్నపం



ఓర్వకల్లు, సెప్టెంబర్ 10 (మహి న్యూస్): కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట హుసేనాపురానికి చెందిన ఎం. ఝాన్సీ తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆవేదన వ్యక్తం చేశారు. 14 ఏళ్లుగా సర్వే నం.70లో ఎకరం 10 సెంట్ల భూమిని సాగు చేస్తున్నప్పటికీ, ఇటీవల ఆ భూమిని వేరొకరి షేక్ ఖజా బి అనే ఆమె పేరుతో నమోదు చేశారని ఆరోపించారు. అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, కొంత మంది టీడీపీ నాయకులు కలిసి తనకు అన్యాయం చేశారని సోలార్ టవర్ పడుతుంది అని తెలుసుకుని డబ్బులు వస్తాయని తెలిసి వేరే వాళ్ళ పేరూ ఎక్కించారు. ఊరిలో ఎక్కడ కాలిగా ఉన్న భూమి చూసి అందులో మ్యాపింగ్ లో ఉండి ఆన్లైన్ లో పేర్లు ఎక్కని వాళ్ళ భూములు కబ్జా చేసి పెద్ద పెద్ద టెంకాయ చెట్లు సీతాఫల చెట్లు ఇలాంటివి నాటి వాళ్ళ కు ఉన్న బినామీ పేర్ల మీద దొంగ పాస్ బుక్ లు పుట్టించుకుంటున్నారు.ఇలాంటి నాయకుల వల్ల చంద్ర బాబు నాయుడు గారికి చెడ్డ పేరు తప్ప ఇంకేమి లేదు ఇలా చేయడం ఎంతవరకు న్యాయం ఇందుకేనా మేము ఓట్లు వేసి గెలిపించుకునేది మహిళా ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళితుల భూములు లాక్కోవద్దని పేద ప్రజలకి అన్యాయం చేయవద్దు అని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన సాగు భూమిని తిరిగి ఇప్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఆమెకు న్యాయం చేయాలి అని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



శ్రీశైలం, మహి న్యూస్, సెప్టెంబర్ 10 : లోకకల్యాణంకోసం దేవస్థానం సెప్టెంబర్ 10 న ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. క లి య ు ు గ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# మట్టి వినాయక విగ్రహాల తయారీపై విద్యార్థులకు అవగాహన

## పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు ప్రోత్సాహం




కర్నూలు, సెప్టెంబర్ 10: (మహి న్యూస్): కర్నూలు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల తయారీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లయన్స్ క్లబ్



కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. మాంటిస్సోరి పాఠశాల, ఏ-క్యాంప్, కట్టమంచి రామలింగారెడ్డి స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేశవరెడ్డి పాఠశాల, క్రిజా పాఠశాలతో పాటు కర్నూలు, దుపాడు ప్రాంతంలోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులను పర్యావరణహిత పద్ధతుల వైపు ప్రోత్సహించేందుకు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. వినాయక చవితి పండుగను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలు, రసాయన ఆధారిత రంగుల వల్ల నీటి వనరులు, నేల, జీవ వైవిధ్యంపై కలిగే ప్రతికూల ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. విగ్రహాల తయారీలో సహజ మట్టిని, పర్యావరణహిత రంగులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఏ-క్యాంప్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ బి. లీలా వెంకట శేషాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి




కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీ పి.వి. కిషోర్ రెడ్డి, శాస్త్రీయ అధికారి శ్రీ జి. నరసింహులు, లయన్స్ క్లబ్ కర్నూలు కార్యదర్శి శ్రీ రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు, దుపాడులోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి సెట్కూర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కె. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను, పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడాన్ని అధికారులు, నిర్వాహకులు అభినందించారు. పండుగలను పర్యావరణ బాధ్యతతో నిర్వహించడం ద్వారా నీటి వనరులు, నేల, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని పేర్కొన్నారు.

### విజేతలకు సెప్టెంబర్ 11న బహుమతులు

మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీల్లో విజేతలకు సెప్టెంబర్ 11న ఉదయం 11 గంటలకు కర్నూలులోని వి.ఆర్. కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయంలో బహుమతులు అందజేయనున్నారు. విద్యార్థులు, ప్రజల్లో కాలుష్యరహిత పండుగల నిర్వహణపై అవగాహన కల్పించడం, పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# నాయకత్వంలో కొత్త ఆలోచన.. పాలనలో సరికొత్త వేగం

## నూతన పాలనా విధానంతో స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన

## 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, సెప్టెంబర్ 10: (మహి న్యూస్) : నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో ముందుకు సాగుతూ పాలనలో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు



దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో నాయకత్వం--నూతన పాలనా విధానంపై ఆయన



ప్రసంగించారు. ప్రస్తుతం నాయకత్వంలో మార్పు దశలో ఉన్నామని, నూతన నాయకత్వ విధానంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణతో ముడిపడి ఉంటుందని తెలిపారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో అంతర్జాలంలో ఉన్న దస్త్రాలు, డేటా నిల్వ వ్యవస్థలు వంటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కృత్రిమ మేధస్సు ద్వారా అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. సాంకేతికత యుగంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారిందని, నైపుణ్యాలను ఎంతగా మెరుగుపరుచుకుంటే అంతగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు.

### ప్రపంచ స్థాయిలో భారతీయ పారిశ్రామికవేత్తల ప్రతిభ

మహిళలు--పురుషులు అనే వ్యత్యాసం గత కాలపు నినాదమని, ప్రస్తుతం ఆ తేడాలకు తావులేదని చంద్రబాబు నాయుడు అన్నారు. అధికార యంత్రాంగానికి, రాజకీయ నాయకులకు వేర్వేరు నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు తన బృందాన్ని ఎంత సమర్థవంతంగా నిర్మించుకుంటారన్నదే ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి రంగంలో ప్రజల సంతృప్తే ముఖ్యమని అన్నారు. ప్రపంచంలోనే భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని, అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలకు భారతీయులే నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయి పనిచేసే తత్వం భారతీయుల్లో ఉందని, దానికి అనుగుణంగా మనమూ మారాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగ వ్యవస్థలు సైతం వేగంగా మారుతున్నాయని, అంతిమంగా విశ్వసనీయతే అత్యంత కీలకమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమను తాము మార్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. గతంలో అనేక అంశాలపై దృష్టి సారించామని, ప్రస్తుతం నాయకత్వంపై ప్రత్యేకంగా ఆలోచించి నూతన విధానాలను అమలు చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. నూతన నాయకత్వ విధానంతో పనిచేయడం ద్వారా పాలనలో వేగం పెంచి, తక్కువ సమయంలో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకునేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో మరో మైలురాయి

## చెత్త బదిలీ కేంద్రాలతో ఇంటింటి సేకరణకు మరింత సమయం

## 100 శాతం ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యం

## వినాయక ఘాట్ వద్ద చిన్న మట్టి విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు




కర్నూలు, సెప్టెంబర్ 10: (మహి న్యూస్): కర్నూలు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యాన్ని సాధించేందుకు మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు ప్రతిసారీ గార్గేయపురం చెత్త నిల్వ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా జీటీఎస్ తరహాలో రెండు చెత్త బదిలీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురువారం వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక ఉన్న విద్యుత్ ఆటోల ఛార్జింగ్ కేంద్రం వద్ద, జొహరాపురం రోడ్డులోని జీటీఎస్ వద్ద ఏర్పాటు చేసిన చెత్త బదిలీ కేంద్రాలను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు సేకరించిన చెత్తను గార్గేయపురం చెత్త నిల్వ కేంద్రానికి తరలించేందుకు వెళ్లాల్సి వచ్చేదని కమిషనర్ తెలిపారు. అక్కడికి వెళ్లి తిరిగి రావడానికి ఎక్కువ సమయం పట్టడంతో ఇంటింటి చెత్త సేకరణకు వాహనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేవి కావన్నారు.

### సమయం ఆదా.. మరిన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరణ

ఈ సమస్యకు పరిష్కారంగా జీటీఎస్ తరహాలో రెండు చెత్త బదిలీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక విద్యుత్ ఆటోల ఛార్జింగ్ కేంద్రం వద్ద ఒకటి, జొహరాపురం రోడ్డులోని జీటీఎస్ వద్ద మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాల్లో చెత్తను పెద్ద పరిమాణంలోని చెత్త తరలింపు వాహనాల్లోకి సులభంగా బదిలీ చేసేందుకు ప్రత్యేక ర్యాంపులను నిర్మించినట్లు వివరించారు. మొత్తం మూడు పెద్ద చెత్త




తరలింపు వాహనాలు ఈ కేంద్రాల నుంచి చెత్తను తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇకపై ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో చెత్తను సేకరించిన అనంతరం సమీపంలోని బదిలీ కేంద్రానికి చేరుకుని, అక్కడ ఏర్పాటు చేసిన పెద్ద చెత్త తరలింపు వాహనాల్లోకి చెత్తను బదిలీ చేస్తాయని కమిషనర్ చెప్పారు. అనంతరం పెద్ద వాహనాలు చెత్తను నేరుగా గార్గేయపురం చెత్త నిల్వ కేంద్రానికి తరలిస్తాయని తెలిపారు. ఈ విధానం ద్వారా ఇంటింటి చెత్త సేకరణ వాహనాలు గార్గేయపురం వెళ్లి తిరిగి రావడానికి పట్టే సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ఆదా అయ్యే సమయాన్ని పూర్తిగా ఇంటింటి చెత్త సేకరణకు వినియోగించుకోవడంతో వాహనాలు ఎక్కువసేపు ప్రజల మధ్య ఉండి మరిన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యాన్ని మరింత సమర్థవంతంగా సాధించవచ్చని కమిషనర్ అన్నారు.

### చిన్న మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు

అనంతరం కమిషనర్ అధికారులతో కలిసి వినాయక ఘాట్‌ను పరిశీలించారు. నగర ప్రజలు ఇళ్లలో ప్రతిష్ఠించే చిన్న మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఘాట్ వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయానికి వర్షాలు కురిస్తే వర్షపు నీరు నిల్వ ఉండేలా నిర్మిస్తున్న అడ్డుకట్టను పరిశీలించారు. అడ్డుకట్ట నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలు కురిసి తగినంత నీరు అందుబాటులోకి వస్తే చిన్న మట్టి విగ్రహాల నిమజ్జనానికి వినాయక ఘాట్‌ను వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

### ప్రజల భాగస్వామ్యం కీలకం

కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలో ఉత్పత్తయ్యే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణలో నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించి పరిశుభ్రమైన కర్నూలు సాధనకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సహాయ ఇంజినీర్ గిరిరాజ్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, జిలానీ, ఫరూక్, శివశంకర్, మునిస్వామి, వాహనాల ఇన్‌చార్జీ కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా.. 2047 విజన్ ప్రణాళికలు పటిష్టంగా అమలు

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబరు 10: అన్నమయ్య జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా.. 2047 విజన్ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు వివరించారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సులో జిల్లాల్లో ప్రగతి, సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల అమలు, లీడర్షిప్, జీఎస్డీపీ, తాగునీరు, గృహనిర్మాణం, జలధార, బెస్ట్ ప్రాక్టీసెస్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి గారు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీక్షలో భాగంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశాలు, ఆశయాల మేరకు సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, జీఎస్డీపీ లక్ష్యాలు, త్రాగునీరు, గృహ నిర్మాణం, జలధార కార్యక్రమాల అమలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో లక్ష్యం మేరకు వందశాతం ప్రగతి సాధనకు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలలో ప్రజాసానుకుల అవగాహన పెంచేందుకు కూడా జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికలు, కార్యాచరణ కార్యక్రమాలపై కూడా కలెక్టర్ ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు. ఈ సదస్సులో రాష్ట్ర మంత్రులు, చీఫ్ సెక్రటరీ, ఆయా శాఖల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలి...!

### సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

### డీఎంహెచ్ఓ డా. యుగంధర్




కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 10: ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. యుగంధర్ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్ సిబ్బందితో డా. యుగంధర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బందికి సంబంధించిన అన్ని వివరాలను సేవా నమోదు పుస్తకంలో (ఎస్ఆర్) తప్పనిసరిగా ధ్రువీకరించి నమోదు చేయాలని ఆదేశించారు. తమ పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి సంబంధించిన ప్రతి అంశాన్ని సేవా నమోదు పుస్తకంలో సక్రమంగా పొందుపరచాలని తెలిపారు.



వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేసి పరిపాలనా సంబంధిత సమస్యలకు తావులేకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ.. సేవా నమోదు పుస్తకాలను భౌతికంగా నిర్వహించడంతో పాటు నిధి పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ సేవా నమోదు పుస్తకాలను ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వైద్య సిబ్బందికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఎస్ఆర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సమాచారాన్ని ఈ-ఆఫీస్ ద్వారానే పంపించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. ప్రవీణ్ మాట్లాడుతూ.. హెచ్‌పీవీ టీకాతో పాటు ఇతర వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత సమయంలో వేయించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించిన పోస్టర్లను డీఎంహెచ్ఓ డా. యుగంధర్ ఆవిష్కరించారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎల్ఏటీఓ డా. రవి బాబు, డీఐఓ డా. ప్రవీణ్, పీఓ ఎన్‌సీడీ/ఆర్‌బీఎస్‌కే డా. ఆరిఫుల్లా, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాన జిల్లా న్యాయమూర్తిని కలిసిన

### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

### నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన డీఎంహెచ్ఓ




కడప, మహి న్యూస్ సెప్టెంబరు 10: కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి. రామగోపాల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్ పుష్ప మొక్కను అందజేసి నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన అంశాలతో పాటు పలు విషయాలపై ఇరువురూ పరస్పరం చర్చించారు.

# రావులపాలెంలో పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ పాటదారుల నిరసన




(రావులపాలెం, సెప్టెంబర్ 10, మహి న్యూస్) : రావులపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ షాపుల అద్దె పెంపు, వేలం విధానాన్ని సవరించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం షాపుల పాటదారులు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక పంచాయతీ కాంప్లెక్స్ వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావులపాలెం గ్రామ పరిధిలోని మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ లో దశాబ్దాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం అమలవుతున్న కొన్ని నిబంధనల వల్ల తమ ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం ప్రతీ 3 సంవత్సరాలకు ఒకసారి 10 శాతం అద్దె పెంచడం, ప్రతి 6 సంవత్సరాలకు ఒకసారి షాపులను మళ్లీ వేలం వేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఆరు సంవత్సరాలకు ఒకసారి




నిర్వహించే ఈ వేలం పాటల కారణంగా బయటి వ్యక్తుల జోక్యం పెరిగి, పాట మొత్తం పెంచేయడం వల్ల ఈ షాపులను నమ్ముకుని వ్యాపారం చేసుకుంటన్న వ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. దీనిని దృష్టిలో పెట్టుకొని 3 సంవత్సరాలకు బదులుగా 6 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే 10 శాతం అద్దె పెంచేలా నిబంధన మార్చాలని, అలాగే ప్రతి 6 సంవత్సరాలకు ఒకసారి వేలం వేసే విధానాన్ని రద్దు చేసి ఎన్నో ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్న వారికి లీజును రెన్యువల్ చేసేలా ప్రభుత్వం, పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# బాలల హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

### బాలకార్మిక వ్యవస్థ, భిక్షాటనను పూర్తిగా అరికట్టాలి

### బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు కె.జి. పద్మలత



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 10: బాలలతో భిక్షాటన చేయించడం, వారిని బాలకార్మికులుగా మార్చడం వంటి చర్యలను పూర్తిగా అరికట్టాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్ల వద్ద నిరంతరం నిఘా ఉంచి బాలలను రక్షించి వారికి తగిన ఆశ్రయం,



విద్య, సంరక్షణ అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి. పద్మలత అధికారులను ఆదేశించారు. కడప జిల్లాలో గురువారం విస్తృతంగా పర్యటించిన ఆమె పలు సంక్షేమ కేంద్రాలు, ఆసుపత్రులు, కారాగారాలు, వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న సంక్షేమం, వైద్య సేవలు, విద్య, వసతి, పౌష్టికాహారం, సంరక్షణ సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా.. బాలల సంక్షేమం, సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ సేవలు ప్రతి చిన్నారికి సమర్థవంతంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పుట్టంపల్లి యానాది కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య, హాజరు, ఎదుగుదల పర్యవేక్షణ రికార్డులను తనిఖీ చేసి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కడప కేంద్ర కారాగారం, మహిళా జైలును తనిఖీ చేసిన కమిషన్ సభ్యురాలు ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, భోజనం, వైద్య సేవలను




పరిశీలించారు. 18 సంవత్సరాల లోపు వయస్సున్న మైనర్లు ఎవరైనా రిమాండ్‌లో ఉన్నారా అనే అంశంపై ప్రవేశ రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీల నైపుణ్యాభివృద్ధి, పునరావాసం కోసం నిర్వహిస్తున్న సబ్బుల తయారీ, బేకరీ, కుట్టు శిక్షణ, ఇనుము తయారీ విభాగాలను పరిశీలించి వాటి నిర్వహణను అభినందించారు. స్థానిక మానసిక ఆరోగ్య ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, సలహా సేవలు, పౌష్టికాహారం, వార్డుల పరిశుభ్రతను పరిశీలించారు. నూతన రిమ్స్‌లోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం, పిల్లల వార్డులను తనిఖీ చేసి వైద్య పరికరాల లభ్యత, చిన్నారులకు అందుతున్న అత్యవసర వైద్య సేవలను పరిశీలించారు. అంకితభావంతో సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందిని అభినందించారు. వన్‌స్టాప్ కేంద్రాన్ని సందర్శించి ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు అందుతున్న రక్షణ, న్యాయ, వైద్య సహాయ సేవలను పరిశీలించారు. కొండాయపల్లిలోని ప్రత్యేక దత్తత సంస్థను సందర్శించి చిన్నారుల సంరక్షణ, ఆహారం, వైద్య పరీక్షలు, దత్తత ప్రక్రియ నిబంధనల అమలును సమీక్షించారు. ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలను సందర్శించి బాలురకు అందుతున్న భోజనం, విద్య, వసతి, వృత్తి విద్యా శిక్షణ సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. ఆయా గృహాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి పి. రమాదేవి, జిల్లా మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి సమన్వయకర్త శ్రీమతి ఎం. శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శ్రీ బి.ఆర్. సుభాష్ యాదవ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 10: ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, క్రమబద్ధంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మదనపల్లె సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ.. వినాయక చవితి ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపే పండుగగా, ఎలాంటి విషాద ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. వివిధ శాఖలు, ఉత్సవ నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు పరస్పర సమన్వయం, సహకారంతో పనిచేయాలని సూచించారు.

### మదనపల్లె సామరస్య సంప్రదాయాన్ని కొనసాగించాలి.

మదనపల్లె పట్టణంలో అన్ని మతాల ప్రజలు పరస్పర సహకారంతో వివిధ పండుగలను సామరస్యపూర్వకంగా నిర్వహించు కుంటున్నారని, ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వినాయక చవితి ఉత్సవాలను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని అన్నారు. గతంలో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### నిమజ్జన ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను ముందుగానే గుర్తించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, పారిశుద్ధ్యం, రహదారి సౌకర్యాలను సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అవసరమైన చోట రహదారి, పొదల తొలగింపు పనులు చేపట్టాలని, ఇరిగేషన్ శాఖ అధికారులు అవసరమైన డీసిల్టేషన్ పనులు చేపట్టాలని సూచించారు.

### పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి.

నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో వాటిని కాలుష్యానికి గురికాకుండా పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహకులు పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా సహకరించాలని సూచించారు.

### మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వినాయక మండపాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, డీజేలు, విద్యుత్, అగ్నిమాపక భద్రత తదితర అంశాలకు సంబంధించి అవసరమైన అనుమతులు ముందుగానే పొందాలని తెలిపారు.

### రాత్రి 10 గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదు.

మదనపల్లి డీఎస్పీ బుచ్చిరాజు మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అవసరమైన అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను కోరారు. రాత్రి 10 గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదని, నిర్ణీత శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రులు, పాఠశాలలు, ఇతర సున్నిత ప్రాంతాలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు.

### అసభ్యకర కార్యక్రమాలకు తావివ్వకూడదు

వినాయక మండపాల వద్ద అసభ్యకరమైన పాటలు, నృత్యాలు, మద్యం సేవించి గొడవలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు యువతకు ముందుగానే తగిన సూచనలు చేయాలని కోరారు.

### సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, నిర్వహకులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 8571231181 మరియు ల్యాండ్ లైన్ నెంబర్ 8571 231181సబ్ కలెక్టర్ కార్యాలయం లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఏదైనా సమస్య తలెత్తితే ఈ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో మీడియా ప్రతినిధుల పాత్ర కీలకమని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భద్రతా సూచనలు, పర్యావరణ పరిరక్షణ, శబ్ద కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఉత్సవ నిర్వాహకులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందదాయకంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మదనపల్లె తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, మదనపల్లె డివిజన్‌లోని వివిధ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, వినాయక ఉత్సవాల నిర్వాహకులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ప్రత్యేకము

### ఏకవింశతి పత్రులు - 21 మొక్కల కథలు...

### డాక్టర్ పత్తి వెంకటకృష్ణారెడ్డి.

కడప మహి న్యూస్ సెప్టెంబర్ 10.: వినాయక చవితి 21 పత్రాల వెనుక ఉన్న అసలు రహస్యం: కేవలం పూజ మాత్రమే కాదు, ఒక అద్భుతమైన 'మెడికల్ కిట్'! ప్రతి సంవత్సరం వినాయక చవితి వేళ గణేశుని విగ్రహం పక్కన రకరకాల ఆకుల కుప్పను మనం చూస్తుంటాం. పూజా గదిలో వ్యాపించే ఆ మాచీపత్రి, మరువక పత్రాల సుగంధం మనసుకి ఎంతో హాయినిస్తుంది. అయితే, పూలు, పళ్లతో పాటు ఈ 21 రకాల ఆకులకు పూజలో ఎందుకు అంత ప్రాధాన్యత ఇస్తారు? ఇది కేవలం తరతరాలుగా వస్తున్న ఒక ఆచారమేనా లేక దీని వెనుక మనం మర్చిపోయిన ఒక గొప్ప సైన్స్ ఉందా?

### సంపూర్ణత్వానికి సంకేతం: 21 సంఖ్య వెనుక ఉన్న మర్మం

గణపతి ఆరాధనలో 21 సంఖ్య పునరావృతం అవ్వడం వెనుక లోతైన ఆధ్యాత్మిక అర్థం ఉంది. మన పూర్వీకుల దృష్టిలో 21 అనేది 'సంపూర్ణత్వానికి' నిదర్శనం. సంపూర్ణత్వం అంటే: పంచభూతాలు (5), పంచ జ్ఞానేంద్రియాలు (5), పంచ కర్మేంద్రియాలు (5), పంచ ప్రాణాలు (5) మరియు మనస్సు (1) = మొత్తం 21. ఈ ఇరవై ఒక్కటి కలిస్తేనే ఒక పరిపూర్ణ జీవం. వీటన్నింటినీ ఆ విఘ్నేశ్వరుని పాదాల చెంత ఉంచడమే ఈ పూజలోని పరమార్థం.

### ఒక పేరు - ఒక పత్రం

ఈ 21 ఆకులను 21 వేర్వేరు దేవతలకు సమర్పిస్తారని చాలామంది పొరపడుతుంటారు. కానీ వాస్తవానికి, ఈ ప్రతి పత్రాన్ని వినాయకుని యొక్క 21 విశిష్ట నామాలను ఉచ్చరిస్తూ ఆయనకే సమర్పిస్తాం. 'ఓం సుముఖాయ నమః' అంటూ మాచీ పత్రంతో మొదలుపెట్టి, చివరగా 'ఓం కపిలాయ నమః' అంటూ అర్క పత్రాన్ని సమర్పించే వరకు ఈ క్రతువు సాగుతుంది. ఇది కేవలం యాంత్రిక ప్రక్రియ కాదు; ఒక అద్భుతమైన 'ధ్యాన ప్రక్రియ'.

నిమజ్జనం వెనుక ఉన్న పర్యావరణ రహస్యం

పూజ ముగిసిన తర్వాత ఈ పత్రాలను విగ్రహంతో పాటు నీటిలో నిమజ్జనం చేయడం వెనుక శాస్త్రీయ కారణం ఉంది. వర్షాకాలం ముగిసిన తర్వాత నదులు, చెరువుల్లో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుంది. నిమజ్జనం చేసిన 24 గంటల తర్వాత, ఈ ఆకుల్లోని ఔషధ రసాయనాలు నీటిలో కలుస్తాయి. ఇవి నీటిలోని హానికర బ్యాక్టీరియాను నిర్మూలించడమే కాకుండా, నీటిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచుతాయి. మన పూర్వీకులు పర్యావరణ పరిరక్షణను ఆచారంతో ముడిపెట్టారు.

### మీ పూజా థాలీలో ఉన్న 'మినీ-ఫార్మసీ' - 21 పత్రాలు

1. మాచీపత్రం: తలనొప్పి, దద్దుర్లు, వాత నొప్పులు, ఒత్తిడి, నిద్రలేమికి సాంప్రదాయ ఉపయోగం.
2. బృహతీపత్రం (నేలములక): జలుబు, దగ్గు, జ్వరం, అజీర్ణం, ఆస్తమాకు ఉపయోగం.
3. బిల్వపత్రం (మారేడు): మధుమేహానికి దివ్య ఔషధం, కామెర్లు, ఆస్తమా, జీర్ణ సమస్యలకు మేలు.
4. దూర్వాయుగ్మం (గరిక): చర్మ వ్యాధులు, గాయాలు మానడానికి, మూత్రంలో మంటకు.
5. దత్తూర పత్రం (ఉమ్మెత్త): నొప్పులు, సెగగడ్డలు, చర్మ సమస్యలకు బాహ్యంగా మాత్రమే.
6. బదరీపత్రం (రేగు): జీర్ణ సమస్యలకు, రోగనిరోధక శక్తికి (విటమిన్ జ).
7. అపామార్గపత్రం (ఉత్తరేణి): దంత సమస్యలు, చెవిపోటు, రక్తస్రావం, కిడ్నీలో రాళ్లకు.
8. తులసీపత్రం: జలుబు, దగ్గు, జ్వరం, రోగనిరోధక శక్తికి.
9. చూత పత్రం (మామిడి): రక్త విరేచనాలు, చర్మ వ్యాధులు, క్రిమి కీటకాల నియంత్రణకు.
10. కరవీర పత్రం (గన్నేరు): కణుతులు, దురద, తేలు కాటుకు బాహ్యంగా. ఇది విషపూరితం, తినకూడదు.
11. విష్ణుక్రాంత పత్రం: జ్వరం, దగ్గు, ఆస్తమా, జ్ఞాపకశక్తికి, తామర వ్యాధికి.
12. దాడిమీ పత్రం (దానిమ్మ): విరేచనాలు, దగ్గు, కామెర్లు, గుండె ఆరోగ్యానికి.
13. దేవదారు పత్రం: అజీర్ణం, చర్మ సమస్యలు, మెదడు ఆరోగ్యానికి, దీని నూనెతో స్నానం శ్వాసకోశానికి మేలు.
14. మరువక పత్రం (మరువం): జీర్ణశక్తికి, జుట్టు రాలడం, ఒత్తిడి తగ్గడానికి.
15. సింధువార పత్రం (వావిలి): జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, గాయాలకు.
16. జాజీ పత్రం (సన్నజాజి): శ్వాసకోశ ఇబ్బందులు, చర్మ వ్యాధులకు.
17. గండకీ పత్రం (కామంచి): మూర్ఛ, పొట్ట వ్యాధులు, నులిపురుగులకు.
18. శమీ పత్రం (జమ్మి): కఫం, అర్శమొలలు, దంత సమస్యలకు.



19. అశ్వత్థ పత్రం (రావి): మలబద్ధకం, కామెర్లు, నోటి పూత, జ్ఞాపకశక్తికి.
20. అర్జున పత్రం (తెల్లమద్ది): గుండె జబ్బులు, రక్తపోటు, కొలెస్ట్రాల్, కీళ్లనొప్పులకు ఆయుర్వేదంలో ప్రసిద్ధి.
21. అర్క పత్రం (జిల్లేడు): చర్మ వ్యాధులు, కీళ్లనొప్పులు, చెవిపోటుకు బాహ్యంగా. ?? పాలరసం విషపూరితం.

ముఖ్యమైన భద్రతా సూచన: ఉమ్మెత్త, గన్నేరు, జిల్లేడు వంటి కొన్ని పత్రులు విషపూరితమైనవి. వాటిని తినకూడదు. పూజ కోసం మాత్రమే వాడి, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఏ మొక్కనైనా ఔషధంగా వాడే ముందు వైద్యుని సలహా తప్పనిసరి.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com